

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 29-08-2025 | సంపుటి - 24 | సంచిక - 111 | రూ : 4 | పేజీలు: 8


## సికింద్రాబాద్-వాడి మధ్య 3, 4వ లైన్లు

- ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వం
- 173 కి.మీ. ప్రాజెక్టు.. రూ.5,102 కోట్ల వ్యయం
- తెలంగాణలో తొలి అంతర్రాష్ట్ర మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టు



హైదరాబాద్: రాష్ట్రం నుంచి మొదటిసారిగా నాలుగు లైన్ల అంతర్రాష్ట రైలుమార్గం నిర్మాణం కానుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన దిల్లీలో బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆర్థిక వ్యవహారాల కమిటీ రూ.12,318 కోట్ల విలువైన నాలుగు రైల్వే ప్రాజెక్టులను ఆమోదించింది. అందులో సికింద్రాబాద్(సనత్‌నగర్)వాడి మధ్య మల్టీ ట్రాకింగ్ నిర్మించేందుకు పచ్చజెండా ఊపింది. రూ.5,102 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టును ఐదేళ్లలో పూర్తిచేయాలన్నది లక్ష్యం. 2026 కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారు. ఈ మార్గంలో ప్రస్తుతం డబుల్ ట్రాక్ ఉంది. తాజా నిర్ణయంతో మూడో, నాలుగు మార్గం(క్వాడ్రాప్లింగ్) పనులు చేపట్టనున్నారు. ఇది పూర్తయితే రాష్ట్రం నుంచి ముంబయి వైపు రైళ్లు వడివడిగా పరుగులు పెట్టనున్నాయి. మరిన్ని కొత్త రైళ్లు వచ్చే అవకాశం ఉంది.

### రద్దీ మార్గం

సికింద్రాబాద్ నుంచి మహారాష్ట్రలోని పుణెకు వెళ్లే శతాబ్ది ఎక్స్‌ప్రెస్ సహా ముంబయి వెళ్లే హుస్సేన్‌సాగర్, ఎల్‌టీటీ ముంబయి తదితర రైళ్లు వికారాబాద్, వాడి మార్గంలో రాకపోకలు సాగిస్తాయి.




# ఐఐటీ సీట్ల సాధనలో.. హైదరాబాద్ జోన్ టాప్

- అత్యధికంగా 4,363 దక్కించుకున్న విద్యార్థులు
- తొలి 500 ర్యాంకర్లలో ఐఐటీహెచ్‌లో చేరింది నలుగురే
- తొలి వెయ్యి ర్యాంకర్లలో 252 మంది బాంబేలోనే
- జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 నివేదిక వెల్లడి

హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించడంలో, ఉత్తీర్ణులు కావడంతోపాటు సీట్ల సాధనలో ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారు. వివిధ ఐఐటీలలోని 18,188 బీటెక్ సీట్లలో ఈ జోన్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళతోపాటు పుదుచ్చేరి విద్యార్థులు 4,363(24%) సొంతం చేసుకున్నారు. ఐఐటీలు, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే విద్యాసంస్థల్లో సీట్ల భర్తీకిగానూ.. జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియ జులైలో పూర్తయింది. జేఈఈ అడ్వాన్స్‌డ్2025పై ఐఐటీ కాన్పూర్ తాజాగా నివేదిక విడుదల చేసింది. ఐఐటీలలో సీట్లు పొందుతున్న అమ్మాయిల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2023లో 3,422 మంది, గతేడు 3,495 మంది, ఈసారి 3,664 మంది సీట్లు పొందారు.

### టాపర్ల ప్రాధాన్యం బాంబే, మద్రాస్, దిల్లీలకే

తొలి 100 ర్యాంకర్లలో 73 మంది ఐఐటీ బాంబేలో, 19 మంది దిల్లీ, ఆరుగురు మద్రాస్‌లో చేరారు.

టాప్ 200 ర్యాంకర్లలో 105 మంది బాంబే, 44 మంది దిల్లీ, 35 మంది మద్రాస్, 12 మంది కాన్పుర్‌లో ప్రవేశాలు పొందారు.

టాప్ 500లో నలుగురు మాత్రమే ఐఐటీ హైదరాబాద్‌లో చేరారు.

తొలి వెయ్యి ర్యాంకర్లలో అత్యధికంగా ఐఐటీ బాంబేలో 252, దిల్లీలో 196, మద్రాస్152, కాన్పుర్124, ఖరగ్‌పుర్85, గువాహటి48, రూర్కీ50, హైదరాబాద్42, వారణాసి7, ఇండోర్1, గాంధీనగర్‌లో ఒకరు ప్రవేశాలు పొందారు.



2లో

## సిరిసిల్లలో వరద బీభత్సం..

హెలికాప్టర్లతో ఐదుగురిని కాపాడిన ఆర్మీ

## భారీ వర్షాలు, వరదలు.. ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే

- వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు విహంగ వీక్షణం
- ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన ముఖ్యమంత్రి
- వరద ప్రవాహాన్ని పరిశీలించిన రేవంత్ రెడ్డి



2లో



2లో

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

అమీర్ పేటలోని బాలాజీ నెయ్యి దుకాణం నుంచి ఎగిసిపడిన మంటలు

## హెలికాప్టర్ పంపలేదు.. ప్రాణాలు పోయాయి

: హరీశ్ రావు ఆగ్రహం

- వరదలతో ప్రజల ప్రాణాలు పోతుంటే రేవంత్ రివ్యూలతో కాలక్షేపం చేస్తున్నారన్న హరీశ్



2లో

## ప్రతి ఇంటికి ఫ్యామిలీ కార్డు...



2లో

- ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు: చంద్రబాబు కీలక నిర్ణయాలు
- ఆధార్ తరహాలో కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం నిర్ణయం
- రైతు బజార్ల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశం



## ఎన్నికల వేళ బీహార్ లోకి చొరబడిన ఉగ్రవాదులు...

- రాష్ట్రంలోకి ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదుల చొరబాటు

2లో

# ప్రతి ఇంటికి ఫ్యామిలీ కార్డు... ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు

**అమరావతి, ఆగష్టు 28** ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాల పంపిణీని మరింత పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ఆధార్ కార్డు తరహాలో ఒక ప్రత్యేక 'ఫ్యామిలీ కార్డు'ను జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఈరోజు 'ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్' వ్యవస్థపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ఒకే కార్డు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ కొత్త ఫ్యామిలీ కార్డులో ఆ కుటుంబం పొందుతున్న ప్రభుత్వ పథకాలతో పాటు అన్ని రకాల వివరాలను నమోదు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఈ సమాచారాన్ని అప్‌డేట్ చేస్తూ, పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రతి కుటుంబ అవసరాలను నేరుగా తెలుసుకోవాలని, ప్రభుత్వ సహాయం అవసరమైన వారికి తక్షణమే లబ్ధి చేకూరేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "కొన్ని ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి రాకూడదు. అలాంటి వాటిని నివారించేందుకు, అందరికీ ప్రయోజనం కలిగేలా పథకాలను రూపొందించే అంశాన్ని పరిశీలిద్దాం" అని తెలిపారు. రాష్ట్రంలో త్వరలోనే ఒక నూతన జనాభా విధానాన్ని (పాపులేషన్ పాలసీ) కూడా తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇబ్బందుల్లో ఉన్న ఉల్లి రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతుల నుంచి ఉల్లిని తక్షణమే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు నుంచే క్వింటాకు రూ.1,200 చెల్లించి ఉల్లిని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఉల్లి రైతుల పరిస్థితి, ఉల్లి ధరలు ఏ మేరకు ఉన్నాయనే అంశంపై ఈ సందర్భంగా చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉల్లి పంటకు సంబంధించిన క్రయ విక్రయాల అంశంపై చర్చించారు. ఉల్లి పంట దెబ్బ తిన్న కారణంగా... మహారాష్ట్రలో ఉల్లి పంట ఎక్కువగా ఉన్న కారణంగా ధరల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు తెలిపారు. వచ్చే పది రోజుల్లో 5 వేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వచ్చే అవకాశం ఉందని సీఎంకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు. క్వింటా ఉల్లిని రూ. 1,200 చొప్పున కొనుగోలు చేయండి. తక్షణం కొనుగోళ్లు ప్రారంభించాలి. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ నుంచి నష్టాన్ని భరించాలి. కమ్యూనిటీ హాళ్లను అద్దెకు తీసుకుని ఉల్లిని ఆరబెట్టాలి. ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లకు పంపిణీ చేయాలి. ఉల్లికి రేటు వచ్చేంత వరకు కమ్యూనిటీ హాళ్లలో నిల్వ చేసుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలి. రైతు నష్టపోకూడదు. వినియోగదారుడు ఇబ్బంది పడకూడదు. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**రైతు బజార్ల ఆధునీకరణకు చర్యలు**

రాష్ట్రంలోని రైతు బజార్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని సీఎం మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న రైతు బజార్ల సంఖ్యను పెంచాలని సూచించారు. వీటిని 150 నుంచి 200 వరకూ చేసేలా ప్రణాళిక చేయాలని అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ "రైతు బజార్లను నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్లాలి. మార్కెట్ యార్డుల్లోని 23 ఎకరాల భూమిని వినియోగించుకుని కొత్తగా ఆధునిక రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలి. మార్కెట్ యార్డుల్లో వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ లను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేయండి. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేలా మార్కెట్ యార్డు స్థలాలు వినియోగించాలి. ధరల నియంత్రణకు, ద్రవ్యోల్బణం పెరగకుండా ఉండేందుకు ఈ చర్యలు ఉపకరిస్తాయి" అని సీఎం అన్నారు.




## జేఎన్‌టీయూ హైదరాబాద్ అన్ని పరీక్షలు వాయిదా

**హైదరాబాద్, ఆగష్టు 28** తెలంగాణ రాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా జేఎన్‌టీయూ హైదరాబాద్ ఈ నెల 29, 30 తేదీల్లో జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. వాయిదా పడిన పరీక్షల నిర్వహణకు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలోని బిక్కనూరు వద్ద ఎడ్లకట్ట వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు రహదారిపైకి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఫలితంగా కామారెడ్డి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే నాగపూర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది.



## హెలికాప్టర్ పంపలేదు.. ప్రాణాలు పోయాయి: హరీశ్ రావు ఆగ్రహం

**హైదరాబాద్, ఆగష్టు 28** రాష్ట్రంలో వరదలతో ప్రజల ప్రాణాలు పోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షల పేరుతో కాలక్షేపం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా" సీఎం తీరు ఉందని ఆయన ఘాటుగా విమర్శించారు. ఒకవైపు ప్రజలు వరదల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోతుంటే, సీఎం మాత్రం మూసీ సుందరీకరణ, ఒలింపిక్స్ నిర్వహణపై సమీక్షలు చేయడం దారుణమని అన్నారు. మెదక్ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో బీఆర్ఎస్ బృందంతో కలిసి పర్యటించిన హరీశ్ రావు, రాజాపేట గ్రామంలో వరద నీటిలో కొట్టుకుపోయి మరణించిన సత్యం కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇద్దరు అమాయకులు చనిపోయారని ఆరోపించారు. "రాజాపేటలో వరద ఉధృతికి ఇద్దరు వ్యక్తులు కరెంట్ స్తంభం ఎక్కి ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్నించారు. దాదాపు నాలుగు గంటల పాటు సహాయం కోసం ఎదురుచూశారు. ఈ విషయం గురించి జిల్లా కలెక్టర్‌కు, ఇతర అధికారులకు సమాచారం ఇచ్చినా ఎవరూ స్పందించలేదు. చివరకు ఆ స్తంభం కూడా కొట్టుకుపోవడంతో వారు ప్రాణాలు విడిచారు" అని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసరాలకు వాడాల్సిన హెలికాప్టర్‌ను పంపి ఉంటే వారి ప్రాణాలు దక్కేవని, కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదని ఆయన అన్నారు. ఒక మంత్రి హెలికాప్టర్లను అత్యవసరాలకు మాత్రమే వాడాలని చెబుతారని, కానీ అధికార పార్టీ నేతలు మాత్రం పెళ్లిళ్లకు, బీహార్ రాజకీయాలకు వాటిని వాడుతున్నారని విమర్శించారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు కనీసం తాగడానికి నీరు లేక వర్షపు నీటినే తాగుతున్నారని, ధూప్ సింగ్ తాండా లాంటి అనేక గ్రామాలు సహాయం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం ఇవ్వాలని కోరారు.

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

**హైదరాబాద్, ఆగష్టు 28 :** హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మెట్రో పిల్లర్ 1444 వద్ద గల బాలాజీ నెయ్యి దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీనితో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మూడు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో దుకాణంలో ఎంతమంది ఉన్నారనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది. మంటలు తీవ్రంగా ఎగసిపడటంతో పక్కనే ఉన్న ఎంబ్రాయిడరీ షాపుకు కూడా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఆ దుకాణంలోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు, నష్టం ఎంత వాటిల్లిందనే వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## భారీ వర్షాలు, వరదలు.. ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే

**హైదరాబాద్, ఆగష్టు 28 :** తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు. వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి ముఖ్యమంత్రి స్వయంగా విహంగ వీక్షణం ద్వారా పరిస్థితిని సమీక్షించారు. ఏరియల్ సర్వే అనంతరం ఆయన ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి, వరద ప్రవాహాన్ని పరిశీలించారు.

**భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటిమట్టం**

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. బుధవారం వరకు తగ్గుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం ఈరోజు ఉదయం నుంచి వేగంగా పెరుగుతోంది. ఉదయం 10 గంటలకు గోదావరి నీటిమట్టం 37 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి వల్ల ఇంకా నీటిమట్టం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. చర్ల మండలంలోని తాలిపేరు జలాశయంలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది.

## హిమాచల్‌లో జల ప్రళయం.. 50 కి.మీ. ట్రాఫిక్ జామ్

- **హిమాచల్‌లో కుండపోత వర్షా లు, కొండచరియల బీభత్సం**
- **చండీగఢ్-కులు హైవేపై 50 కిలోమీటర్ల భారీ ట్రాఫిక్ జామ్**
- **మార్గమధ్యంలో చిక్కుకున్న వందలాది పండ్లు, కూరగాయల ట్రక్కులు**
- **లారీల్లోనే కుళ్లిపోతున్న కోట్ల రూపాయల విలువైన యాపిల్స్**

**హిమాచల్ ప్రదేశ్, ఆగష్టు 28:** హిమాచల్ ప్రదేశ్‌లో కుండపోత వర్షాలు బీభత్సం సృష్టించడంతో జనజీవనం స్తంభించింది. భారీగా కొండచరియలు విరిగిపడటంతో చండీగఢ్‌కులు జాతీయ రహదారిపై సుమారు 50 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీని ఫలితంగా ఢిల్లీకి వెళ్లాల్సిన కోట్ల రూపాయల విలువైన పండ్లు, కూరగాయలతో ఉన్న వందలాది ట్రక్కులు మార్గమధ్యంలోనే చిక్కుకుపోయాయి. లారీల్లోని యాపిల్స్, టమోటాలు వంటి సరుకులు కుళ్లిపోతున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ట్రక్కులో సుమారు రూ.4 లక్షల నుంచి రూ.4.5 లక్షల విలువైన సరుకు ఉందని, మొత్తం మీద రూ.50 కోట్లకు పైగా విలువైన యాపిల్స్ రవాణాలో నిలిచిపోయాయని అంచనా. తన యాపిల్ లోడుతో సాహిబాబాద్ పండ్ల మార్కెట్‌కు వెళ్లాల్సి ఉండగా ఐదు రోజులుగా కులులోనే చిక్కుకుపోయానని గఫార్ అనే ట్రక్ డ్రైవర్ తెలిపారు. ఆజాద్‌పూర్, సాహిబాబాద్ మార్కెట్లకు వెళ్లే వేలాది ట్రక్కులు ఇలాగే చిక్కుకున్నాయని ఆయన వివరించారు. మండీకులు మధ్య దాదాపు అర డజను ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. బియాస్ నది ఉధృతంగా ప్రవహించడం వల్ల హైవే చాలా చోట్ల దెబ్బతిన్నదని, మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఇంజనీర్ అశోక్ చౌహాన్ తెలిపారు. ప్రస్తుతానికి చిన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తుండగా భారీ వాహనాలు మాత్రం రోజుల తరబడి నిలిచిపోయాయి. ఈ విపత్తు వల్ల మనాలికి ఒకవైపు నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయని మనాలి సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ రామన్ శర్మ పేర్కొన్నారు. కులులోని రామ్‌శిలా సమీపంలో ఇళ్లు దెబ్బతిన్నాయని, అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ఈ ప్రాంతం నాశనమయ్యే ప్రమాదం ఉందని జై భల్ అనే స్థానికుడు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నుంచి ఇప్పటివరకు నాలుగు దుకాణాలు, రెండు రెస్టారెంట్లు, ఒక ఇల్లు ధ్వంసమయ్యాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం నుంచి భారీ వర్షాలు కురుస్తుండగా మండీ, కులు జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి.

## సిరిసిల్లలో వరద బీభత్సం.. హెలికాప్టర్లతో ఐదుగురిని కాపాడిన ఆర్మీ

**సిరిసిల్ల, ఆగష్టు 28:** తెలంగాణ రాష్ట్రం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరద నీటిలో చిక్కుకున్న ఐదుగురిని సైనిక హెలికాప్టర్లు గురువారం రక్షించాయి. గంభీరావుపేట మండలంలోని ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద బుధవారం నుంచి వరద ఉధృతిలో చిక్కుకున్న వీరిని రక్షించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పశువులను మేపేందుకు వెళ్లిన ఈ ఐదుగురు గ్రామస్థులు, అకస్మాత్తుగా పెరిగిన వరద ప్రవాహానికి చిక్కుకుపోయారు. విషయం తెలుసుకున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెంటనే స్పందించారు. ఆయన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడి, బాధితులను కాపాడేందుకు తక్షణమే హెలికాప్టర్లను పంపాలని విజ్ఞప్తి చేశారు. బండి సంజయ్ అభ్యర్థనపై రాజ్‌నాథ్ సింగ్ వెంటనే స్పందించి, సహాయక చర్యల కోసం రెండు హెలికాప్టర్లను పంపాలని రక్షణ శాఖ అధికారులను ఆదేశించారు. హెలికాప్టర్లు ఘటనా స్థలానికి చేరుకోవడానికి ముందు, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి. గీతే ఆధ్వర్యంలో అధికారులు డ్రోన్ల సహాయంతో బాధితులకు ఆహార పొట్లాలు, నిత్యావసరాలను అందించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ బుధవారం బాధితులతో ఫోన్‌లో మాట్లాడి, వారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తామని ధైర్యం చెప్పారు. సహాయక చర్యల సమన్వయంపై ఐఏఎఫ్ ఎయిర్ కమోడోర్ వి.ఎస్. సైనీ, గ్రూప్ కెప్టెన్ చటోపాధ్యాయలతో బండి సంజయ్ సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా హెలికాప్టర్ల రాక ఆలస్యమైందని, నాందేడ్, బీదర్ వంటి ప్రత్యామ్నాయ కేంద్రాల నుంచి వాటిని తరలించేందుకు ప్రయత్నిస్తున్నామని వారు వివరించారు. సహాయక చర్యలు పూర్తయినప్పటికీ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆ రెండు హెలికాప్టర్లు సిరిసిల్లలోనే ఉంటాయని మంత్రి తెలిపారు. తక్షణమే స్పందించి సహాయం అందించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్నికల వేళ బీహార్ లోకి చొరబడిన ఉగ్రవాదులు... హై అలర్ట్



**బీహార్, ఆగష్టు 28:** అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బీహార్‌లో ఉగ్రవాదుల కదలికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ (జెఇఎం) ఉగ్రవాద సంస్థకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ సమాచారంతో అప్రమత్తమైన బీహార్ పోలీసు యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రస్తుతం రాష్ట్రంలో పర్యటిస్తుండటంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, రావల్పిండికి చెందిన హస్నైన్ అలీ, ఉమర్‌కోట్‌కు చెందిన ఆదిల్ హుస్సేన్, బహవల్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఉస్మాన్ అనే ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు నేపాల్ సరిహద్దు ద్వారా బీహార్‌లోకి చొరబడ్డారు. గత వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు నిర్ధారించాయి. దీంతో అధికారులు వెంటనే వారి ఫోటోలు, ఇతర వివరాలను అన్ని జిల్లాల పోలీసులకు పంపించారు. ముఖ్యంగా నేపాల్‌తో 729 కిలోమీటర్ల సరిహద్దు పంచుకుంటున్న జిల్లాలు, సీమాంచల్ ప్రాంతంలో భద్రతను గణనీయంగా పెంచారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, జనసమ్మర్ధ ప్రదేశాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పెట్రోలింగ్‌ను తీవ్రతరం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే తక్షణమే సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. మరికొన్ని నెలల్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది. గత మే నెలలో కూడా రాష్ట్రంలో 18 మంది అనుమానితులను గుర్తించగా, వారిలో ఒకరు ఖలిస్థానీ సానుభూతిపరుడిగా తేలడం గమనార్హం.

ప్రజాస్ఫూర్తి


# కొలనుపాక వాగుపై యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జినీ నిర్మించాలి

* **ఆలేరు బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు పూజారి కుమారస్వామి గౌడ్**

ఆలేరు, ప్రజాస్ఫూర్తి : కొలనుపాక వాగుపై యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జినీ నిర్మించాలి ఎడతెరిపి కురుస్తున్న వర్షాలకు కొలనుపాక వాగు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్న ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని వాగుపై బ్రిడ్జిని యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య మండల పార్టీ అధ్యక్షుడు పూజారి కుమారస్వామి గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎడతెరిపి కురుస్తున్న వర్షాల కారణంగా ప్రవహిస్తున్న కొలనుపాక వాగును గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల ముందు గెలిచిన వెంటనే కొలను పాక వాగు పై బ్రిడ్జిని నిర్మిస్తారని ప్రజలకు హామీ ఇచ్చి గెలిచిన తర్వాత శంకుస్థాపనకే పరిమితం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వాగులపై బ్రిడ్జి లేకపోవడం వల్ల ఇప్పటి వరకే చాలామంది వాహనదారుకు తీవ్ర గాయాలయ్యాయి మరికొందరు మృతి చెందారు అయినప్పటికీ ప్రభుత్వానికి నిమ్మకు నీరెత్తనట్టు చోద్యం చూస్తున్నారని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి కొలనుపాక



వాగుపై యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జి నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బోగ శ్రీనివాస్ జిల్లా అధికార ప్రతినిధి తునికి దశరథ, మండల పట్టణ ప్రధాన కార్యదర్శిలు శేషత్వం అమరేందర్ ఏలగల వెంకటేష్, ఉపాధ్యక్షుడు మాస పేట రాజు, కార్యదర్శి బైరి మహేందర్ గౌడ్, ఓ బి సి మండల ప్రధాన కార్యదర్శి అంకం రాజు, బూత్ అధ్యక్షులు గడ్డం సందీప్, శ్యామల, శ్రీకాంత్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గిరిబోయిన పరశురాములు, కొత్తపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

## కుర్రారం చెరువును సందర్శించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : కుర్రారం చెరువు కత్వా తెగిపోవటం తో చెరువు కత్వను సందర్శించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుర్రారం గ్రామ చెరువు కత్వా 4.4 కోట్ల రూపాయల తో మంజూరు..కాగా తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి రాబోయే నీటి నిల్వ కోసం అధికారులు, రైతులు శ్రమించాలని బీర్ల అయిలయ్య తెలిపారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి కుర్రారం చెరువు కత్వా మరమ్మతులు, శాశ్వత పరిష్కార కోసం మాట్లాడారు ఈ కార్యక్రమంలో రాజపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జై హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బుద్ధానగర్ లో జై హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.దాసరి శ్రావణిదయాకర్ రెడ్డి దంపతులు విగ్రహం ఇప్పించి గణనాధునుకి భక్తిశ్రద్ధలతో మొదటిరోజు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.అసోసియేషన్ సభ్యులతో వారి కుటుంబాలతో పాల్గొని వేద మంత్రోచ్చరణల మధ్య గణపతి పూజలలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీవాసులతో పాటు ఫ్రెండ్స్ అందరం కలిసి గత కొన్ని సంవత్సరాలుగా వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని గణనాదుని ఆశీస్సులు మాపై ఉన్నాయని అన్నారు.ఇక్కడ ఉత్సవాలు నిర్వహించడానికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులకు భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అదనపు ఆదాయం ఉపాధి అవకాశాలు పెంచేలా మోడల్ డెమో ఫామ్

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా లో ప్రజలకు అదనపు ఆదాయం , ఉపాధి అవకాశాలు పెంచేలా మోడల్ డెమో ఫామ్ ను రూపొందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం బూర్గం పహాడ్ మండలం మోరంపల్లి బంజర గ్రామపంచాయతీ పరిధిలోని కెనాల్ పక్కన ఉన్న నీటి పారుదల శాఖ భూమిలో నూతనంగా ఏర్పాటు చేయు మోడల్ డెమో ఫామ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ డెమో ఫామ్ ను ఏ విధంగా అభివృద్ధి చేయాలి అనే దానిపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ డెమో ఫామ్ లో కూరగాయల సాగు, మట్టితో ఇటుకల తయారీ యూనిట్, వెదురు , వాక్కాయ కంచె, క్వాయిల్ యూనిట్ షెడ్ , సోలార్ డ్రైవర్ ఏర్పాటు చేయడంతో పాటు మునగ చెట్లు పెంచే విధంగా ప్రణాళికలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ మోడల్ డెమో ఫామ్ ద్వారా రైతులకు మాత్రమే కాకుండా మహిళలకు కూడా ఉపాధి అవకాశాలు కలగడం, సరికొత్త వ్యవసాయ పద్ధతులు పరిచయం కావడం ద్వారా అదనపు ఆదాయ వనరులు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బి ఎన్ ప్రసాద్, ఆర్ ఐ నరసింహారావు, ఎస్సారెల్పి ఏఈ సందీప్, ఎంపీ ఓ బాలయ్య, ఏపీఓ విజయలక్ష్మి, ఏపీఎం హేమంతిని, పంచాయతీ సెక్రెటరీ భవాని, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ నాగార్జున తదితరులు

## ఇందిరమ్మ ఇండ్ల సాకుతో అక్రమ ఇసుక రవాణా చేస్తే కేసులు తప్పవు

* **వివాదాస్పద స్థలాల్లో వినాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయవద్దు....**
* **యాదగిరిగుట్ట రూరల్ సీఐ మాదాసు శంకర్ గౌడ్**



రాజపేట, ప్రజా స్ఫూర్తి : నిబంధనలు పాటిస్తూ వినాయక నవరాత్రి ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, స్థల యజమానుల అనుమతి లేకుండా వివాదాస్పద స్థలాల్లో గణేష్ మండపాల ఏర్పాటు చేయవద్దని,, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో అక్రమ ఇసుక రావాణ చేసిన నిబంధనలు పాటించని వారిపై కేసులు తప్పవని యాదగిరిగుట్ట రూరల్ సీఐ మాదాసు శంకర్ గౌడ్ హెచ్చరించారు. మంగళవారం రాజపేట లోని పోలీస్ స్టేషన్ ను ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎస్సై అనిల్ కుమార్ ద్వారా మండలంలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు జరుపుకునే మంటపాలు ఏర్పాటు చేసుకునేవారు ఆన్లైన్ ద్వారా తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని ఆ తర్వాత పోలీసుల అనుమతి లభిస్తుందన్నారు. ఇప్పటివరకు అతి తక్కువ దరఖాస్తులు వచ్చాయని మిగతా వారందరూ వెంటనే ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సీఐ కోరారు. మంటపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్తు కనెక్షన్ శిక్షణ పొందిన వ్యక్తితో బిగించుకోవాలని, వర్షాలు పడుతున్న సందర్భంగా నాణ్యమైన విద్యుత్ వైరుని వాడాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయని సిఐ వివరించారు. డీజే లకు ఎలాంటి అనుమతి లేదని, డీజీలు వినియోగిస్తే కేసులు అవుతాయని, సాంప్రదాయ భక్తి పాటలను మంటపాల వద్ద వినిపించాలని, అశ్లీల, ద్వంద్వ అర్థాల పాటలు వేయవద్దని, ఎవరికి ఇబ్బంది కలగకుండా మంట పాలు ఏర్పాటు చేసుకోవాలని వివాదాస్పద స్థలాల్లో గణేష్ మండపాలు వేయవద్దని స్థల యజమాని అనుమతి పొంది మంటపం ఏర్పాటు చేసుకోవాలన్నారు., వినాయక మంటపం వద్ద ఏర్పాటుచేసిన దీపం అడుగున ఇసుక ఏర్పాటు చేసుకోవాలని పలు జాగ్రత్తలను సీఐ తెలిపారు. రాత్రివేళ తప్పకుండా మండపం వద్ద నిర్వాహకులలో ఒకరు ఉండాలని, కేటాయించిన కుంటలు, చెరువులలోనే వినాయక నిమజ్జనం సకాలంలో చేయాలని సిఐ సూచించారు. ఈ సందర్భంగా రాజపేట మండల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో అక్రమ ఇసుక దందా కొనసాగుతుందని గతంలో కేసులు నమోదు చేసినట్లు అలాగే కొనసాగితే ముమ్మందు కూడా మరిన్ని కేసులు నమోదు అవుతాయని అవసరమైతే రౌడీషీటర్ గా కేసులో నమోదు చేయనున్నట్లు సిఐ హెచ్చరించారు. అక్రమ ఇసుక డంపులు చేసి లారీలలో హైదరాబాద్ కు తరలించిన సందర్భంగా గతంలో కేసులు నమోదైనట్లు రాజపేట మండలంలో మాత్రమే అనుమతి పొందిన ప్రదేశంలో నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేయాలన్నారు. తహసిల్దార్ ఉత్తర్వుల మేరకు లబ్ధిదారిని ఇంటివద్ద ఇసుక డంప్ చేయాలని, ట్రాక్టర్ ఇంజన్ లకు నెంబర్ లతో కూడిన నెంబర్ ప్లేట్ ఉండాలని, నెంబర్ ప్లేట్ లేకున్నా ఉత్తర్వులో పేర్కొన్న నెంబర్ కాకుండా వేరే ట్రాక్టర్ నెంబరు ఉన్న కేసు నమోదు చేనున్నట్లు, ప్రత్యేక పోలీసు బృందం నిఘా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కొందరు ట్రాక్టర్ రవాణా చేసే వారు అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చినట్లు అధికారులు ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు ఉంటాయన్నారు. అధికారులకు పోలీసుల భద్రత ఎప్పుడూ ఉంటుందని ముమ్మందు అధికారులను బెదిరించినట్లు తెలిస్తే చట్టపైన పైన చర్యలు కేసులు నమోదవుతాయన్నారు. చట్టాన్ని గౌరవించిన వారికే ఫ్రెండ్లీ పోలీస్ అని ఉల్లంఘించిన వారికి చట్టపరమైన చర్యలు ఉంటాయని ఇకనుండి జాగ్రత్తగా మసలుకోవాలని ఇసుక మాఫియా దారులను సిఐ హెచ్చరించారు.



## తహశీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా విజయవంతం చేయాలి

**- బూరుగు కృష్ణారెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజాసమస్యల పరిష్కారానికై సెప్టెంబర్ 1వ తేదీన చౌటుప్పల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుబూర్గు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండల కేంద్రం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పాలకపక్షం లేకపోవడం వల్ల అనేక సమస్యలు పేరుకపోయాయని, ప్రధానంగా మంచినీళ్లు, విద్యుత్తు, మురుగు కాలువలు వంటి సమస్యలు గ్రామాలలో పెద్ద ఎత్తున తిష్టవేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నపడిన వర్షాలకు రోడ్లకు గుంతలు పడి అధ్వాన్నంగా మారాయని ఆరోపించారు. మండలంలోని విషపూరితమైన కెమికల్ కంపెనీలతో వచ్చే విష కాలుష్యంతో ఊపిరితిత్తులు, గుండె సమస్యలు, కిడ్నీ సమస్యలు, కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులతో అనేక రకంగా ఇబ్బంది పడుతున్నా, ప్రజలను పట్టించుకునే నాధుడే కరువయ్యాడని దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శులు సమస్యలు పరిష్కరించమంటే, అప్పులు చేసి ఎంత కాలం పనులు చేపించాలని ఆవేదన పడుతున్నారన్నారు. గ్రామాల ఇంచార్జి అధికారులు పేరుకే ఉన్నారని, గ్రామాలను సందర్శించే పరిస్థితి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను అమలు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలో రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు కార్మికులు మహిళలు యువకులు, పేదలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తడక మోహన్, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్, చెరుకు లక్ష్మమ్మ, పల్లె మధు కృష్ణ, ఆదిమూలం నందీశ్వర్, జక్కిడి దేవేందర్ రెడ్డి, కొండే శ్రీశైలం, బోదాస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూడవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బాధ్యతల స్వీకరణ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం మూడవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ గా వనం వినయ్ కుమార్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన రెండవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. రవికుమార్ నుండి బాధ్యతలు స్వీకరించారు.

## పొట్టిమర్రి వాగును పరిశీలించిన బిజెపి



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ రాజపేట మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం పొట్టి మర్రివాగును మండల శాఖ అధ్యక్షులు మేకల రమేష్ బృందం సందర్శించి మాట్లాడారు. ఈ పరిస్థితి రావడానికి గల కారణం గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వం అని విమర్శించారు. శంకుస్థాపన చేయగా పనులు మాత్రం మొదలు కాలేదన్నారు. రాకపోకలు బంద్ అయి బస్సులు రాక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని వరద తగ్గిన వెంటనే పనులు మొదలుపెట్టి పూర్తిచేయాలని, మండలంలోని బేగంపేట పారుపల్లి వంతెనలు కూడా త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేసారు. కష్ట కాలంలో ఎక్కడ వరదలు వచ్చినా కార్యకర్తలు ముందుండి సహాయ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్ రెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ రామచంద్రం, బూర్గు శేఖర్ రెడ్డి, భీమనపల్లి రమేష్, కటికేం నగేష్, బూరెల్ల శ్రీనివాస్, ముచ్చింతల రాజు, భీమగాని శివ,సార్ల రాధ కృష్ణ, గుజ్జుక సందీప్, ఆడెపు పాండు, బరిగే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో ఘనంగా పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మల్లాపూర్, మీర్‌పేట్ హెచ్‌బి కాలనీ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రివి. శ్రీనివాస్ గౌడ్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, మీర్‌పేట్ హెచ్‌బి కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, పంజాల శ్రవణ్ కుమార్ గౌడ్, గజ్జెల సత్యరాజ్ గౌడ్, అంబాల నారాయణ గౌడ్, కురెళ్ళ వేములయ్య గౌడ్ తో పాటు గౌడ యువజన సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, సబ్బండ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్ ఎస్కర్షన్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య




ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు నియోజకవర్గం కామేపల్లి మండలం పాత లింగాల గ్రామంలో కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్ ఎస్కర్షన్లో భాగంగా శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యుల కోరం కనకయ్య , తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, కామేపల్లి మండల అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, కామేపల్లి మండల టీం , మండల నాయకులు మహిళా నాయకురాలు, కార్యకర్తలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ వార్డ్ మెంబర్స్, ప్రతి గ్రామం నుంచి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇటుకలు అందించేందుకు ప్రత్యేక చర్యలు

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు , ఉపాధి హామీ పథకం పనులకు నాణ్యమైన ఇటుకలను తక్కువ ఖర్చుతో అందించడానికి మణుగూరు మండలం దమ్మక్కపేట సమీపంలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) వద్ద ఫ్లై యాష్ వినియోగంతో నాణ్యమైన ఇటుకలు తయారీ విధానాన్ని గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇటుకల తయారీ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లాలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు , ఉపాధి హామీ పథకం పనులలో అధిక నాణ్యత కలిగిన నిర్మాణ సామాగ్రి అందించడం ప్రధాన లక్ష్యం అని కలెక్టర్ తెలిపారు. ఫ్లై యాష్ వినియోగం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని, ఉత్పత్తి తర్వాత మిగిలిన వ్యర్థ పదార్థాన్ని సమర్థవంతంగా వినియోగించి ఇటుకలని తయారుచేసి ఉపయోగించవచ్చని చెప్పారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా విస్తృతంగా ఇటుకలను తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు , ఉపాధి హామీ పథకం పనుల్లో అధిక నాణ్యత కలిగిన నిర్మాణ సామాగ్రి అందించడం ముఖ్యమైనది అని, ఇసుక, సిమెంట్, ఫ్లై యాష్ మరియు మట్టి (క్లే) మిశ్రమాలతో ఇటుకలు తయారీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరలో, నాణ్యమైన ఇటుకలను అందించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. వీటిపై విస్తృత ప్రచారం జరగడం ద్వారా జిల్లాలో పెద్ద ఎత్తున ఇటుకల తయారికి దోహదం అవుతుందని, తద్వారా లబ్ధిదారులు నేరుగా లాభపడగలరని తెలిపారు. ఆగస్టు 30న బీటీపీఎస్‌లో మూడు మిషన్ల ద్వారా వివిధ మిశ్రమాలతో నాణ్యమైన ఇటుకలను తయారుచేసే విధానంపై శిక్షణ , అవగాహన కార్యక్రమం నిర్వహించడుతుంది అని, ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, సంబంధిత అధికారులు, ఔత్సాహికులు పెద్ద ఎత్తున పాల్గొని శిక్షణ పొందవచ్చని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్‌లు, సూపరిండెంట్ ఇంజనీర్లు, పంచాయతీరాజ్ అధికారులు, ఉపాధి హామీ పథకం అధికారులు, గృహ నిర్మాణ విభాగ ఇంజనీర్లు, తాసిల్దార్, ఎంపీడీవో, ఏపీవో , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## గోదావరి నది పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం క్రమేపీ పెరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నది.కావున గోదావరి నది పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ ఇతర శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతుందని తెలియజేశారు. అత్యవసరమైతే తప్పు బయటికి రావద్దని సూచించారు.ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో వాగులు,వంకలు పొంగిపొర్లుతున్నాయని తెలిపారు. ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువులు,వాగులు,వంకల వద్దకు వీడియోల కోసం,సెల్ఫీల కోసం వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు.వాహనదారులు ప్రయాణాలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ఎవరైనా విపత్కర పరిస్థితుల్లో ఉంటే వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు వారి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.

## అయ్యప్ప కన్స్ట్రక్షన్ కార్యాలయంలో విఘ్నేశ్వరుడి పూజ కార్యక్రమం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) :కూకట్పల్లి అయ్యప్ప కన్స్ట్రక్షన్ కార్యాలయంలో గణననాదుడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.కన్సైడ్ ఎమ్మెల్యే బి. సంజీవరావు వివేకానంద నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాషిపాక యాదగిరి, 121వ డివిజన్ సీనియర్ నాయకులు కుమార్ యాదవ్,మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎస్సీ విభాగం జాయింట్ కన్వీనర్ కావలి చెన్నయ్య, సర్వే నెంబర్ 376 జిఎంకె వెంచర్ అధ్యక్షులు అజయ్ చోప్రా,సురేందర్ రెడ్డి,శేఖర్ యాదవ్ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ - "ప్రతీ ఆరంభం విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జరగాలి అనే విశ్వాసంతో ఈ పూజ కార్యక్రమం నిర్వహించమన్నారు. ప్రజల ఆశీస్సులు, భగవంతుని కృపతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది అని వారు పేర్కొన్నారు.

## తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు సర్వీసు పొడిగింపు

హైదరాబాద్: తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు సర్వీసు పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 31న రామకృష్ణారావు పదవీ విరమణ చేయాల్సి ఉండగా.. ఆయన సర్వీసు పొడిగించాలని డీవోపీటీని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీంతో మరో 7 నెలలు సర్వీసు పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు ఇచ్చింది. మార్చి వరకు రామకృష్ణారావు తెలంగాణ సీఎస్‌గా కొనసాగనున్నారు.



## విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలు

*** సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు.విద్యుత్ పోరాట అమరవీరుల వర్ధంతి కార్యక్రమం స్థానిక మంచికంటి భవన్లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగింది.ముందుగా అమరవీరుల చిత్ర పటానికి కనకయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఇరవై ఐదు సంవత్సరాల క్రితం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు విధానాలను నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అమలు చేయడంలో భాగంగా విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాడని అన్నారు.చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంకు విధానాలను నిరసిస్తూ మూడు నెలల పాటు ఆందోళన పోరాటాలు ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగాయని అన్నారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిస్తూ వేలాదిమంది ప్రజలతో హైదరాబాద్ చేరుకోగా కర్కశ చంద్రబాబు ప్రభుత్వం లాటరీ చార్జీ చేయడంతోపాటు శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ప్రజలపై కాల్పులు జరిపించిందని ఈ కాల్పుల్లో రామకృష్ణ విష్ణువర్ధన్ బాలస్వామిలు మరణించారని అన్నారు. అమరవీరుల పోరాట ఫలితంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వెనక్కు తగ్గిందని నాటినుండి నేటి వరకు ఏ ప్రభుత్వాలు కూడా విద్యుత్ ఛార్జీలు పెంచడానికి సాహసం చేయలేదని ఆయన తెలియజేశారు. ప్రజా పోరాటానికి అంతటి ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలియజేశారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నూతన విద్యుత్ సంస్కరణల చట్టం తీసుకొచ్చి ప్రజలపై భారాలు మోపడానికి సిద్ధమవుతుందని ఈ కుట్రలను విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ నాయకులు కాళంగి హరికృష్ణ నాగకృష్ణ వై వెంకటేశ్వరరావు జలాల్ సతీష్ సలీం విజయ్ మోహన్ సింగ్ నసూర్ సంధ్య రుహీనా తదితరులు పాల్గొన్నారు.



## వైఎస్ఆర్ విగ్రహావిష్కరణకు విజయమ్మకు ఆహ్వానం

*** సెప్టెంబర్ 2 న మహాదేవ పురం లో విగ్రహావిష్కరణ సభ**

ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :సెప్టెంబర్ 2 న గాజులరామారం డివిజన్ మహాదేవపురం చౌరస్తాలో పి. రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిధిగా రావాలని వైఎస్.విజయమ్మను విగ్రహ ప్రతిష్టాపన కమిటీ నాయకులు ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరాధ్య దైవం, పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వై ఎస్ అన్నారు. నదులకు సైతం నడకలు నేర్పి నేలలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని, ఉచిత గుండె ఆపరేషన్ ల ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడిన ఆరోగ్య శ్రీ ప్రదాత అని గుర్తు చేసారు. బడుగు బలహీన అట్టడుగు వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరికి విద్యావకాశాలు కల్పించిన విద్యాప్రదాత వై ఎస్ అని, ఆకలి పేదరికం అనే మహమ్మారిని తన అభివృద్ధి వజ్రాయుధంతో నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడు అన్నారు. రైతు,మహిళా, విద్యార్థి,కార్మిక,కర్షక పక్షపాతిగా అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలను అందించిన ఘనత ప్రియతమ నాయకుడు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డికె దక్కిందన్నారు. ఆయన 16వ వర్ధంతి సందర్భంగా మహాదేవ పురం లో విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వై ఎస్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో నాయకులు సాతాల గోపాల్,జగదీశ్వర్ రెడ్డి,మల్లు సురేందర్ రెడ్డి, వెంకటస్వామి రెడ్డి, ధనుంజయ రెడ్డి,రాయల్. వై ఉత్తమ్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఇంటింటికి వెళ్లి సంతకాలు చేయించింది బీఆర్ఎస్ నాయకులు కాదా?

*** సర్వే నంబర్ 1పై బీఆర్ఎస్ నాయకుల దొంగ నాటకాలు**

*** మంత్రులను కలిసి రైతులను న్యాయం చేస్తాం: కాంగ్రెస్ నాయకులు**



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 28: సర్వే నంబర్ ఒకటి విషయంలో బిఆర్ఎస్ నాయకులవి దొంగ నాటకాలని, రైతుల ఇంటింటికి వెళ్లి సంతకాలు చేయించి,ఈ రోజు మొసలి కన్నీళ్ళు కారుస్తున్నారని జిన్నారం మండల పార్టీ అధ్యక్షుడు వడ్డే కృష్ణ,మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ లు ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సర్వే నంబర్ ఒకటి రైతుల నుండి భూములను తీసుకోవాలని నిర్ణయించింది బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. ఆరోజు రైతుల పక్షాన నిలబడి కాంగ్రెస్ నిరసన తెలిపితే దాడులు చేయించి కేసులు బనాయించారని ఆరోపించారు. ఇంటింటికి వెళ్లి సంతకాలు చేయించి రైతుల గొంతుకోసి బీఆర్ఎస్ నాయకులు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. యూరియా కొరత లేకున్నా సోషల్ మీడియా ద్వారా కృత్రిమ కొరతను సృష్టించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే మార్పు మొదలైందని ఆ మార్పు ప్రజలకు తెలుసని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి వహిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలి

*** పల్లె శేఖర్ రెడ్డి**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వాసుపత్రిలో రోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి వహిస్తున్న వైద్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. రోగులకు వైద్యం సరిగ్గా అందుతుందా అని పరిశీలించారు. వైద్యులు సమయపాలన పాటిస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి విష జ్వరాల బారినపడిన రోగులు అనేకమంది వస్తున్నా, వైద్యులు కనీసం వారిని థర్మామీటర్, బీపీ చెక్ అప్, చేయకుండానే, వారిని కరోనా పేషంట్ లాగా దూరం నిలబెట్టి మందులు రాసి పంపడం జరుగుతుందని ఆరోపించారు. మధ్యాహ్నం 2గంటల తర్వాత రోగులు వస్తే, వారిని చూడకుండా టైం అయిపోయిందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పుకుంటూ వెళ్ళిపోతున్నారన్నారని ఆరోపించారు. ప్రభుత్వాసుపత్రిలో సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ప్రైవేటు హాస్పిటల్ ను నిర్వహిస్తున్న వైద్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉడుత రామలింగం, కొండూరు వెంకటేష్, రొండి నరసింహ, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ నారాయణ పాఠశాలలో ఘనంగా వినాయకచవితి వేడుకలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నెహ్రూనగర్‌లోని నారాయణ పాఠశాలలో వినాయక చవితి వేడుకలు నారాయణ పాఠశాలల ఏజిఎం రాంకీ ఆధ్వర్యంలో ఘనంగా, సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపంలో శ్రీ సిద్ధి వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్టించి, వ్రత సంకల్పం, కలశ పూజ, మహాగణపతి పూజ, ప్రాణ ప్రతిష్ట, షోడశోపచార పూజలను ఆలయాలనూ తలపించే విధంగా నిర్వహించారు. బ్యాండు మేళతాళాల మధ్య పూజా కార్యక్రమం శ్రద్ధాభక్తులతో జరిగింది. ఈ వేడుకలో పాల్గొన్న డీజీఎం రమణా రెడ్డి మాట్లాడుతూ, "నవరాత్రి ఉత్సవాల వంటి పండుగలు భక్తిని పెంపొందించడమే కాక, సమాజంలో శాంతి, ఐకమత్యానికి దారితీస్తాయి. రాగద్వేషాలు వీడి సాన్నిహిత్యం పెరుగుతుంది," అని అన్నారు. ఏజిఎం రాంకీ మాట్లాడుతూ, "ఈ వేడుకలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఉత్సాహం అభినందనీయం. వినాయకుని ఆశీస్సులతో పిల్లలు విద్యాభివృద్ధిలో ముందుకు పోవాలి," అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ క్రాంతి కుమార్, ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు దీప్తి, కావ్య, అఖిల, శ్వేతా, ఏవో వీర, పీఈటీ వినయ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అలుగుపారిన ఆనందం..

* కన్‌సాన్‌పల్లిలో అలుగుపారుతున్న కొండరెడ్డికుంట, ఖాదర్‌చెరువు,పెద్ద చెరువులు
* మూడు దశాబ్దాల తర్వాత అలుగు దుంకిన ఖాదర్ చెరువు
* సంతోషం వ్యక్తం చేస్తున్న ముదిరాజులు, గ్రామస్తులు

అందోలు, ప్రజాస్ఫూర్తి: భారీ వర్షాలు కురుస్తుండడంతో అందోలు మండలంలో చెరువులు, కుంటలకు జలకళ వచ్చింది. ఆయా గ్రామాల్లోని చెరువులు అలుగులు పారుతున్నాయి. గత మూడు రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి.దీంతో చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది.. అందోలు మండలంలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో గత మూడేళ్ల క్రితం 30 ఏళ్ల తర్వాత కొండరెడ్డి కుంట అలుగు దుంకడంతో గ్రామస్తులు అమ్మయ్య.. ఎన్ని ఏళ్ల తర్వాత అలుగు పారిందంటూ చర్చించుకున్నారు. అదే రీతిలోనే గ్రామంలో మరో చెరువు 30 ఏళ్ల చెరువు అలుపారిన చరిత్రను తిరగరాస్తూ ఖాదర్ చెరువు పూర్తిగా నిండి నిండి అలుగు దుంకుతుంది. గత వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు సగానికి నిండిన చెరువు మళ్లీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరద నీరు ఒక్కసారిగా పెద్ద ఎత్తున వచ్చి చేరడంతో ఖాదర్ చెరువు నిండుకుండలా మారి అలుగు పారుతోంది..ఓవైపు ఖాదర్‌చెరువు.. మరోవైపు కొండరెడ్డి కుంట రెండూ కలిసిపోయి.. నిండుకుండల్లా మారాయి.. దీంతో ఆ అందాలను చూసేందుకు తరలివస్తున్నారు గ్రామ సందర్శకులు.. సుమారుగా 39 ఏళ్ల తర్వాత అలుగు పారడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు ప్రజలు..మరోవైపు..కొండరెడ్డికుంట కూడా అలుగు పారుతుండటంతో అక్కడి నుంచి చేపలు బయటకు వెళ్లకుండా వలలు ఏర్పాటు చేశారు. అలుగు దూకి కిందకు నీరు వెళ్తుండడంతో కొండరెడ్డికుంట అలుగు పారుతోంది. ఖాదర్‌చెరువు సుమారుగా 16 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉండగా 1986 సంవత్సరంలో ఈ చెరువు నిండి అలుగు దూకగా మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత అలుగు పారుతున్నట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సందర్భంగా అలుగు వద్ద ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఎం.ఈశ్వరయ్య కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు మొరబోయిన క్రిష్ణ, సభ్యులు రామన్నగారి చంద్రయ్య, వని దుర్గయ్య, ఎం.మహేష్, పుట్ల రమేశ్, వని నాగయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.



చెరువుల వద్ద సందడి.. ఖాదర్ చెరువు, కొండర్‌చెరువులు అలుగులు పారుతుండడంతో క్రమంగా పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. 39 ఏళ్ల తర్వాత ఖాదర్‌చెరువు అలుగు పారుతున్నట్లు వృద్ధులు మాట్లాడుతున్న మాటలు విన్న యువకులు, పెద్దలు మొదలుగా ఖాదర్‌చెరువు వద్దకు చేరుకొని అటు తర్వాత కొండర్‌చెరువు వద్దకు చేరి చెరువుల అందాలు.. అలుగు దూకే ప్రాంతానికి వెళ్తున్న సందర్శకులు.. ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ గ్రామ వాట్సాప్ గ్రూపులలో షేర్ చేస్తున్నారు. కొండర్‌చెరువు అలుగు దూకి రోడ్డుపై నుండి నీరు ప్రవహిస్తుండడంతో యువకులు నీటిలో నుండి వాహనాలను అటుఇటు వైపుగా తిప్పుతూ సందడి చేస్తున్నారు. గత రెండు మూడేళ్లుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు నిండి బోరుబావులకు ఇబ్బందులు లేకుండా ఉండి రెండు పంటల సాగుకు అనుకూలంగా మారుతోందంటూ స్థానికులు సంబరాలు చేసుకుంటున్నారు.

* మత్తడి దూకడం మొదటిసారి చూస్తున్నామంటున్న యువకులు..

పెద్ద చెరువు రెండు నుండి మూడేళ్లకొకసారి అలుగు పారడం వంటి సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయని, కొదర్‌చెరువు, ఖాదర్‌చెరువులు అలుగులు పారడం చూడలేదు. అయితే కొండర్‌చెరువు మూడేళ్ల క్రితం ఆ తర్వాత ప్రస్తుతం కూడా పారుతోంది.కానీ కురుస్తున్న భారీ వర్షాలతో సుమారు మూడు దశాబ్దాల తర్వాత ఖాదర్ చెరువు నిండి పారుతుందంటూ గ్రామ పెద్దలు చెబుతుండడం ప్రస్తుతం అలుగు పారడం ఇదే మొదటిసారి చూస్తున్నామంటూ అలుగు పారడాన్ని చూసి సంతోషంగా ఉందని గ్రామ యువకులు చెబుతున్నారు.

## శ్రీ వరసిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: స్థానిక ఇల్లందు 14వ నెంబర్ బస్తి వాస్తవ్యులు శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ వారి తరఫున ప్రతి ఏడాది 14వ నెంబర్ బస్తి యూత్ కమిటీ వారు వినాయక చవితి సంబరాలు జరుపుకుంటారు. గణనాథుడు కొలువు తీరే సందర్భంగా గణనాథుడిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కమిటీ వారు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల తిరుపతిరావు, కేశవ్లాల్, బాణాల శ్రీనివాస్, వాసుదేవ్, నాగేందర్, కిషోరిలాల్, కళ్యాణ్, కార్తీక్, రాకేష్, పృధ్విరాజ్, రామ్ నివాస్, నిషాల్ పాసి.తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి పూజల్లో పాల్గొన్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని పలు మండపాల్లో కొలువై ఉన్న విఘ్న నాయకుడిని పూజించిన ఆయన విగ్నేశ్వరుడి ఆశీస్సులతో అందరు ఆనందంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో కంచర్ల.సతీష్, మురళి,పవన్,నల్లమోతు. రవి,జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు కరీం పాషా, కొత్తగూడెం పట్టణ ఓబిసి అధ్యక్షులు.జయప్రకాష్, బొబ్బాల. వెంకట్ యాదవ్,యువజన కాంగ్రెస్ నాయకులు రేవంత్,సాయిచందు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక చవితి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , ఇల్లందు: ఇల్లందు టౌన్ ఆంబజార్ లో ప్రతి ఎడాది హమాలీ సోదరుల అధ్వర్యంలో నిర్వహించే వినాయక చవతి ఉత్సవాలలో భాగంగా వారి ఆహ్వానం మేరకు హజరై స్థానిక షావుకారులందరితో కలిసి స్వామి వారికి స్థానిక షావుకారులందరితో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య.వారి వెంట పాల్గోన్న ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు. ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాము,నాయకులు మడుగు సాంబ మూర్తి,బోళ్ళ సూర్యం,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉఫాధ్యక్షులు ఈసం లక్ష్మణ్,బండి ఆనంద్,దండుఎఉల శీవ,కునుసోత్ రాము తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా గణేష్ నవరాత్రి వేడుకలు

ప్రజాస్ఫూర్తి ఇల్లందు: ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి వేడుకలు స్థానిక 18వ వార్డులో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వినాయక చవితి సందర్భంగా గురువారం రెండో రోజు ఉదయం గణనాథుడికి విశిష్ట పూజలు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ మండల, పట్టణ అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మహాసభ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం గణేష్ మండపంలో స్వామివారికి వివిధ రకాల అలంకరణలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడతామని అన్నారు.వేడుకల్లో పాల్గొనే భక్తులందరికీ తీర్థం, ప్రసాదం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సంవత్సరం విగ్రహ దాత శ్రీరంగం సుబ్బారావు, నిత్య ప్రసాద్ దాత పెండ్యాల సుధాకర్, లడ్డు దాత సైఫా రాజశేఖర్, పూజా సామాగ్రి దాత తాటిపల్లి



సుబ్బారావు గా ఉన్నారు.ఈ పూజ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యువజన సంఘం అధ్యక్షుడు నరేంద్రుల అను, కండె రమేష్, వాసవి క్లబ్ అధ్యక్షుడు భోనగిరి రవికిరణ్, యెలుగూరి మధుబాబు, గందె సురేష్, ఆనందరావు, గౌరిశెట్టి పురుషోత్తం, చందా భద్రం, వ్యామసాని రవి, పసుమర్తి వాసు, కటకం బాలకృష్ణ, యెలుగూరి మోహన్, ఆకుల సతీష్, జంగాల హరీష్, రామిడి శంకర్, గౌరిశెట్టి నగేష్, మేడా రాకేష్, అర్వపల్లి గణేష్, దివ్వెల నాగేశ్వరరావు, డోకుపర్తి అంజయ్య, శ్రీకాంత్, సైఫా సాత్విక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాలతో సామాజిక సమానత్వం వెల్లివిరియాలి

* కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

ప్రజా స్ఫూర్తి , భద్రాద్రి కొత్తగూడెం : వినాయక చవితి పర్వదినం సందర్భంగా గణేష్ టెంపుల్, శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలను తిలకించారు. అనంతరం పట్టణ, పరిసర ప్రాంతాలు, గ్రామాల్లో ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సిపిఐ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉత్సవ



కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

## వాడ వాడలా కొలువుదీరిన గణనాథుడు

అందోలు, ప్రజాస్ఫూర్తి:వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం వాడవాడలా గణనాథుడు కొలువుదీరాడు. అందోలు మండలంలోని పలు గ్రామాల్లోని వీధుల్లో విగ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని నవరాత్రుల సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీలు రెండు మూడు రోజుల ముందు నుండే మండపాలను అందంగా అలంకరించారు.ఉదయం నుండి సాయంత్రం వరకు అన్ని గ్రామాల్లో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిగాయి. గణనాథుడు కొలువు తీరే సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కన్ సాన్ పల్లి గ్రామంలో పలు యూత్ సంఘాల ఆధ్వర్యంలో గణనాధున్ని నెలకోల్పి ప్రత్యేక



పూజలు నిర్వహించారు



## గణేష్ నిమజ్జనోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ రోహిత్ రాజు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గణేష్ నవరాత్రుల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం వద్ద గోదావరి నదికి నిమజ్జనోత్సవానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ పటిష్టమైన ఏర్పాట్లను చేయడం జరుగుతుందని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ఈ సందర్భంగా గోదావరి నది కరకట్ట వద్ద జరుగుతున్న నిమజ్జనోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.అక్కడ ఉన్న అధికారులకు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గోదావరి నది ఉదృతంగా ప్రవహిస్తూ ప్రమాదకరంగా మారుతున్న క్రమంలో పరిసర ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గోదావరి నదీ ప్రవాహాన్ని వీక్షించేందుకు కరకట్ట మీదకు ఎవరూ రాకూడదని సూచించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో కరకట్ట మీద ఎవరైనా సంచరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కరకట్ట పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలియజేశారు.నిమజ్జనోత్సవానికి గణేష్ ప్రతిమలను తీసుకొని వచ్చే ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు వారి సూచనలను పాటిస్తూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,భద్రాచలం సీఐ నాగరాజు , ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## విఘ్నాలను తొలగించే స్వామి విఘ్నేశ్వరస్వామి

* మార్కెట్ చైర్మన్ వెంకటయ్య



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మనం చేసే ప్రతి పనిలో విఘ్నానాలను తొలగించి.. మంచి జరిగేలా ఆశీర్వదించే దేవుడు విఘ్నేశ్వర స్వామి అని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రక్కన ది ప్రెస్ క్లబ్ చౌటుప్పల్ వారి సౌజన్యంతో శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ఏర్పాటు చేసిన శ్రీ వినాయక స్వామికి ఆకుల ఇంద్రసేనారెడ్డితో కలిసి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ భగవంతుని పట్ల ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలన్నారు. గణనాథుడు కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డిలను పాత్రికేయులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక చవితి వేడుకలు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : వినాయక చవితి పండుగను ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో కుల మతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. వినాయక చవితి సంధర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ , డివిజన్ పరిధిలోని మహాత్మా గాంధీ నగర్, ఎన్టీఆర్ శివాలయం వద్ద , శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో కాలనీ వాసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలను సందర్శించి, గణేష్ పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, మహిళలు, భక్తులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడికి పూజలు చేసిన చౌటుప్పల్

* ఏసిపి మధుసూదన్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆవరణలో స్నేహ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద గురువారం చౌటుప్పల్ ఏసిపి మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మధ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, యూత్ సభ్యులు ఏసిపి మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మధ కుమార్, ఎస్ఐ అజయ్ భార్గవ్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఆర్గనైజర్స్ తొర్పునూరి మల్లేష్, చింతల తిరుమలరెడ్డి, టీ పరమేష్, ఓరగంటి వెంకటేష్, ఆదిమూలం శ్రీనివాస్, గణేష్, శశిధర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, అజయ్, శివాజీ, మనీ, వెంకట మురళి, అభి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నదిపై తేలియాడే గణపయ్య.. నిమజ్జనంలోనూ ప్రత్యేకమే!

వినాయచ చవితి వేడుకల వేళ గణపతి మండపాలు ఒక్కోచోట ఒక్కో విధమైన వైవిధ్యతను చాటుతుంటాయి. గుజరాత్‌లోని సూరత్‌లో రాండర్ ప్రాంతానికి చెందిన యువకులు ఈ వేడుకల్లో వినూత్నతో పాటు పర్యావరణం పట్ల తమ బాధ్యతను చాటేలా మండపాన్ని తీర్చిదిద్దారు. ఇక్కడి తాపి నదిలో తేలియాడే ఆలయాన్ని ఏర్పాటు చేసి అందులో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఫైబర్ గ్లాస్ షీట్లతో రూపొందించిన తేలియాడే దీప స్తంభంలా కనిపిస్తోన్న ఈ విలక్షణమైన మండపం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. 2006లో సూరత్‌లో సంభవించిన తీవ్రమైన వరదల కారణంగా ఆ నగరం తీవ్ర విధ్వంసానికి గురైంది. దీంతో ఆ మరుసటి ఏడాది నుంచి తాపి నదిలో తేలియాడే ఆలయంలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించే సంప్రదాయాన్ని మొదలు పెట్టారు. నది ఉగ్రరూపం



నుంచి తమ నగరాన్ని కాపాడుకొనేందుకు, ప్రవాహ ఉద్ధృతిని తగ్గించాలని దేవతామూర్తులను వేడుకొనేలా ఈ తరహాలో వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్నారు. అయితే, కొవిడ్ మహమ్మారి నేపథ్యంలో విరామం ప్రకటించిన నిర్వాహకులు తాజాగా దాన్ని పునరుద్ధరించారు. అక్కడి సంప్రదాయం ప్రకారం యువకుల సమూహం రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నది మధ్యలోకి వెళ్లి ఆలయంలో హారతి, భజనలతో గణపయ్యను ఆరాధిస్తూ తమ భక్తిని చాటుతుంటారు. పది రోజుల పూజల అనంతరం విగ్రహాన్ని నదిలో నిమజ్జనం చేయకుండా ఓ భక్తుడి ఇంటికి తీసుకెళ్లి ప్రత్యేక కుండలో నిమజ్జనం పూర్తి చేయడం ద్వారా అటు భక్తిని, ఇటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను సంప్రదాయంగా పాటిస్తుండటం విశేషం.



## 35 వేలమందితో విఘ్నేశ్వరుడికి 'అథర్వశీర్ష'

పుణె: వినాయక నవరాత్రులు వచ్చాయంటే విభిన్న రూపాల్లో కనిపించే గణపతులే కాదు.. మండపాల్లోని అలంకారాలు, సాంస్కృతిక కార్యక్రమాలూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. అలా మహారాష్ట్రలోని పుణెలో శ్రీమంత్ దగ్డుషేత్ హల్వాయి గణపతి మందిరంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 35 వేల మంది మహిళలు గణేశ్ అథర్వశీర్షను ఆలపించారు. సుమారు 133 ఏళ్లుగా ఈ ఆలయంలో గణేశ్ ఉత్సవాలు జరుగుతున్నాయి. గడిచిన 40 ఏళ్లుగా అథర్వశీర్ష పారాయణం నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా అర్ధరాత్రి నుంచే మహిళా భక్తులు మండపానికి సంప్రదాయ వస్త్రధారణలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ భార్య, ఎంపీ సునేత్ర పవార్ పాల్గొన్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

## తెలంగాణ ఆహార పరిశ్రమకు ప్రోత్సాహం: ఘనంగా హైబిజ్ టీవీ ఫుడ్ అవార్డ్స్

- **అభినందనలు తెలిపిన పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

హైదరాబాద్, 28 ఆగస్టు (ప్రజాస్ఫూర్తి): హైబిజ్ టీవీ ఫుడ్ అవార్డ్స్ 4వ ఎడిషన్ ఆగస్టు 26న హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో అట్టహాసంగా నిర్వహించబడింది. తెలంగాణ ఆహార పరిశ్రమ అభివృద్ధికి, ప్రతిభావంతులైన ఫుడ్ ఎంటర్ప్రెన్యూర్స్‌ను ప్రోత్సహించడానికి ఈ అవార్డ్స్ వేదికగా నిలిచాయి.ఈ వేడుకకు ముఖ్య అతిథిగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వర్చువల్‌గా పాల్గొన్నారు. హైబిజ్ టీవీ ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల అభినందనలు తెలియజేస్తూ, "తెలంగాణ సంస్కృతి, ఆహార వైవిధ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడానికి, పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ఇలాంటి వేదికలు అత్యంత అవసరం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫుడ్ ఇండస్ట్రీలో విశేష కృషి చేసిన ముగ్గురు ప్రముఖులకు లెజెండ్



పురస్కారాలు ప్రదానం చేశారు. ఓప్రీస్ సంస్థ నుండి రవికుమార్, వివాహ భోజనంబు నుండి వెంకట రామరాజు, సింప్లీ సౌత్ నుండి షెఫ్ చలపతి రావులు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. అదనంగా, ఫుడ్ ఇండస్ట్రీలోని పలు విభాగాల్లో మరో 50 మందికి పైగా అవార్డులు అందజేశారు.ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా టిజిటిడిసీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి హాజరయ్యారు. సెలబ్రిటీ అతిథిగా మిస్ యూనివర్స్ తెలంగాణ కష్వీ పాల్గొనగా, జెమినీ ఎడిబుల్స్ & ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ & మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి. చంద్రశేఖర రెడ్డి అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు. హైబిజ్ టీవీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. రాజ్ గోపాల్, హైబిజ్ టీవీ ఎల్ఎల్పి & తెలుగు నౌ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జె. సంధ్యారాణి తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రతి కుటుంబంలో ముగ్గురు పిల్లలు ఉండాలి

సంతానోత్పత్తి రేటు తక్కువగా ఉన్న సమాజాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని, అందుకే ప్రతి భారతీయ కుటుంబం ముగ్గురు పిల్లలు ఉండేలా చూసుకోవాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. జనాభా స్థిరీకరణతోపాటు క్షీణతను నిరోధించడానికి ఇది దోహదపడుతుందన్నారు. ఆరెస్సెస్ వందేళ్లు పూర్తిచేసుకున్న నేపథ్యంలో దిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన మత మార్పిడిలు, చొరబాట్లు, హిందూముస్లిం ఐక్యత, పలు రాష్ట్రాల్లో భాషా వివాదాలు వంటి అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా భాజపాతో ఎటువంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.

**ముగ్గురు పిల్లలు..**

''సరైన వయసులో వివాహం చేసుకోవడం, ముగ్గురు పిల్లల్ని కనడం అనేది తల్లిదండ్రులకు, పిల్లలకూ ఆరోగ్యకరం. జనాభా పెరుగుదల




ఓ వరమైనప్పటికీ.. కొంత భారమే. అందరికీ ఆహారం సహా అన్ని వసతులు అందించాలి. జనాభా నియంత్రణ విధానం ఉన్నది అందుకే. ముగ్గురికంటే ఎక్కువ పిల్లలు ఉండకుండా జాగ్రత్త పడాలి. తద్వారా పెంపకంలో ఇబ్బందులు రావు. ఈ వాస్తవాన్ని అంగీకరిస్తూ ముగ్గురు పిల్లలు ఉండేలా కొత్త తరాలు చూసుకోవాలి'' అని భాగవత్ పేర్కొన్నారు.

**మత మార్పిడిలు ఆందోళనకరం..**

జనాభా సమతుల్యత సమస్యను ప్రతి దేశం ఎదుర్కొంటోందని మోహన్ భాగవత్ పేర్కొన్నారు. ఈ క్రమంలో మతమార్పిడిలు ఆందోళన కలిగిస్తున్నాయన్న ఆయన.. కొన్ని వర్గాల వారు కూడా ఇది మంచిది కాదని చెబుతున్నారన్నారు. చొరబాట్ల గురించి మాట్లాడుతూ.. డీఎన్ఏ ఒకటే అయితే అనుమతి తీసుకొని దేశంలోకి రావచ్చన్నారు. అక్రమంగా వస్తేనే సమస్యలు వస్తాయని చెప్పారు. చొరబాట్లను ప్రభుత్వాలు కొంతవరకే అడ్డుకోగలవని, వీరికి ఉపాధి కల్పించకుండా సామాన్యులు కూడా ప్రభుత్వాలకు సాయం చేయొచ్చన్నారు.

**భాజపాతో విభేదాల్లేవ్..**

భాజపా కోసం ఆరెస్సెస్ నిర్ణయాలు తీసుకుంటుందనేది వాస్తవం కాదని మోహన్ భాగవత్ స్పష్టం చేశారు.



## వణికిస్తున్న వర్షా లు.. 50కి.మీ మేర ట్రాఫిక్ జామ్

ఉత్తరాదిని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. పర్వత ప్రాంతాల్లో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రోడ్లు మూసుకుపోయి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చండీగఢ్ కులూమనాలి జాతీయ రహదారి పలుచోట్ల బ్లాక్ అయ్యింది. దీంతో వేలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయినట్లు అధికారులు వెల్లడించారు. సుమారు 50 కి.మీ మేర ట్రాఫిక్ స్తంభించిపోయినట్లు చెప్పారు. దేశ రాజధాని దిల్లీకి ఈ మార్గంలోనే ఎక్కువగా పండ్లు, కూరగాయలు రవాణా అవుతాయి. దాదాపు ఆ ట్రక్కులన్నీ ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. దీంతో ప్రయాణికులను నిలిపివేసి.. నిత్యావసర వస్తువుల రవాణాకు అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. సాధారణ ప్రయాణికులు గంటల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో వారంతా ఆందోళనకు దిగారు. అధికారులు కలగజేసుకొని వారికి సర్దిచెప్పి ట్రాఫిక్‌ను చక్కదిద్దుతున్నారు. మండి కులూ మధ్యనే దాదాపు 12 చోట్ల కొండ చరియలు విరిగిపడినట్లు అధికారులు చెబుతున్నారు. బియాస్ నదీ ఉద్ధృతంగా ప్రవహించడం వల్ల కులూమనాలి మధ్య పలుచోట్ల రహదారి కోతకు గురైనట్లు ఎన్‌హెచ్ఏఐ ఇంజినీర్ అశోక్‌చౌహాన్ తెలిపారు. పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నట్లు చెప్పారు. తాజా పరిస్థితులను దృష్టిలోఉంచుకొని విహార యాత్రలు ప్లాన్ చేసుకోవాలని సూచించారు.

## సికింద్రాబాద్‌తిరుపతి వందేభారత్.. ఇక 20 కోచ్‌లు!

వందేభారత్‌కు లభిస్తున్న ఆదరణ నేపథ్యంలో రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్ తిరుపతి సహా ఏడు మార్గాల్లో నడిచే వందేభారత్ రైళ్ల కోచ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. సికింద్రాబాద్‌తిరుపతి, మంగళూరు సెంట్రల్ తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్‌తిరునల్వేలి, మదురైబెంగళూరు కంటోన్మెంట్, దేవ్‌గఢ్ వారణాసి, హవ్‌డారౌర్కెలా, ఇందౌర్‌నాగ్‌పుర్ మధ్య నడిచే వందేభారత్ రైళ్లలో ఎక్కువ కోచ్‌లు అందుబాటులో ఉండనున్నాయి. ప్రస్తుతం మూడు మార్గాల్లో 16 కోచ్‌లు, నాలుగు రూట్‌లలో ఎనిమిది కోచ్‌ల వందేభారత్ రైళ్లు నడుస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. 16 కోచ్‌ల రైలును 20 కోచ్‌లతో, ఎనిమిది కోచ్‌ల రైళ్ల స్థానంలో 16 కోచ్‌లకు అప్‌గ్రేడ్ చేయనున్నట్లు రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రజా సంబంధాలు) దిలీప్ కుమార్ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో (జులై 31, 2025 నాటికి) వందేభారత్ రైళ్ల రద్దీ సమాచారాన్ని పరిగణనలోకి తీసుకొని వీటిని



అందుబాటులో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

**సికింద్రాబాద్-తిరుపతి 20 కోచ్‌లు..**

సికింద్రాబాద్ తిరుపతి సహా మంగళూరు సెంట్రల్ తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్ తిరునల్వేలి మార్గాల్లో ప్రస్తుతం 16 కోచ్‌ల వందేభారత్ నడుస్తుండగా.. దీనిని 20 కోచ్‌లకు పెంచనున్నారు. మిగతా నాలుగు మార్గాల్లో ఎనిమిది కోచ్‌ల రైళ్లు నడుస్తుండగా.. వాటి స్థానంలో 16 కోచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడు మార్గాల్లో కోచ్‌ల అప్‌గ్రేడ్‌తోపాటు మరిన్ని 20 కోచ్‌ల వందేభారత్ రైళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు. కొత్తగా వచ్చే 16, 8 కోచ్‌ల రైళ్లను కొత్త మార్గాల్లో ఉపయోగిస్తామన్నారు.

## ఆ ఊరిలో ఒక్క వినాయకుడే... ఇంటింటికీ వస్తాడు!

వినాయక చవితి 2025 వచ్చిందంటే చాలు ఊరూ వాడా ఒకటే సందడి. దేశ వ్యాప్తంగా చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో గణేశుడిని పూజించి ఆనందిస్తారు. వినాయక చవితి వేడుకలు జరపడంలో మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లాలో ఓ గ్రామం మాత్రం ప్రత్యేకంగా నిలుస్తోంది. సాధారణంగా మహారాష్ట్రలోని కొంకణ్ తీర ప్రాంతంలో వినాయక చవితి వేడుకల్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. ప్రతి ఇంట్లో గణేశుడిని కొలువుదీర్చి హారతులు, మేళతాళాలతో ఒకటే కోలాహలంగా జరుపుతుంటారు. కానీ, రాయ్‌గఢ్ జిల్లాలోని మాంగావ్ తహసీల్‌లోని సేల్ అనే గ్రామంలో మాత్రం ఏ ఇంట్లోనూ ప్రత్యేకంగా గణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేసే సంప్రదాయం లేదు. ఊళ్లో మొత్తంగా 150 200 ఇళ్లు ఉంటే అందరూ ఒకటే విగ్రహాన్ని ఏర్పాటు చేసి అత్యంత భక్తిశ్రద్ధలతో గణపయ్యను పూజిస్తుండటం శతాబ్దాలుగా ఇక్కడ కొనసాగుతోన్న సంప్రదాయం. గణేశ్ చతుర్థి తొలి రోజున గ్రామస్థులంతా ఆలయం వద్దకు చేరుకుంటారు. అక్కడి సంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించాక.. గంగా లేక్ నుంచి మేళ తాళాలతో గణేశ్ ఊరేగింపు మొదలవుతుంది. స్వామివారి పల్లకీని ఇంటింటికీ స్వాగతించి పూజలు చేస్తారు. చివరకు ఊరేగింపు ఆలయానికి తిరిగి చేరుకుంటుంది. ప్రతి ఇంట్లో వినాయక చవితి చేసే బదులుగా సామూహికంగా ఒకేచోట పూజించడం ఇక్కడి ప్రత్యేక సంప్రదాయం. ఈ పండుగకు పెళ్లైనవారు, మరేదైనా కారణంతో ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలు సైతం గ్రామానికి వచ్చి భగవంతుడి ఆశీస్సులు తీసుకుంటారు. ముంబయి, పుణె వంటి నగరాల నుంచీ కొందరు వచ్చి పూజల్లో పాల్గొంటారు. ఇక్కడ 'ఒకే గ్రామం ఒకే గణపతి' సంప్రదాయం ఎప్పుడు మొదలైందో ఈ తరానికి కచ్చితంగా తెలియనప్పటికీ.. వందల ఏళ్లుగా ఈ సంస్కృతి సజీవంగా ఉన్నట్లు చెబుతున్నారు.

## వాణిజ్యం ఇప్పుడో ఆయుధం
## టారిఫ్‌లపై రఘురాం రాజన్ కీలక వ్యాఖ్యలు

భారత్‌పై అమెరికా విధించిన అదనపు టారిఫ్‌లు కేవలం ట్రేడ్ టూల్ మాత్రమే కాదని రిజర్వ్ బ్యాంక్ ఇండియా మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. రాజకీయ, ఆర్థిక శక్తిగా ఎదిగేందుకే ట్రంప్ ఈ సుంకాల భారం మోపుతున్నారని అభిప్రాయపడ్డారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన టారిఫ్‌ల అంశంపై స్పందించారు. ''టారిఫ్‌ల భారం భారత్‌కు ఓ మేలుకొలుపు లాంటిది. ఏ దేశంపైనా విస్తృతంగా ఆధారపడకూడదు. యూఎస్‌తో వాణిజ్యం కొనసాగిస్తూనే ఐరోపా, ఆఫ్రికా వంటి దేశాలపైనా దృష్టి సారించాలి. ఈ రోజుల్లో వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక అవసరాలు యుద్ధానికి ఆయుధాలుగా మారుతున్నాయి. వీటిపట్ల న్యూదిల్లీ జాగ్రత్తగా వ్యవహరించాలి.



వృద్ధికి ఊతమిచ్చే, యువతకు ఉపాధి కల్పించే సంస్కరణలను తీసుకురావాలి'' అని సూచించారు. ట్రంప్ టారిఫ్‌లు విధించేందుకు అనేక కారణాలు ఉన్నాయని రాజన్ అన్నారు. ''కరెంటు ఖాతా లోటు, ద్రవ్య లోటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అమెరికాను ఇతర దేశాలు వాడుకుంటున్నాయని ట్రంప్ భావిస్తున్నారు. కానీ, చౌక ధరకు వస్తువులను దిగుమతి చేసుకుంటున్నందుకు అమెరికా వినియోగదారులే ప్రయోజనం పొందుతున్నారన్న విషయాన్ని మర్చిపోయారేమో. ఇక, ఈ సుంకాలను ఆయన ఇతర దేశాలపై పన్నులుగా పరిగణిస్తున్నారు. తద్వారా అమెరికాకు ఆదాయం సమకూరుతుందని ఆలోచిస్తున్నారు. అయితే, దీని వల్ల సొంత ప్రజలకే నష్టం జరుగుతుందన్న విషయాన్ని గుర్తించట్లేదు. సైనిక శక్తిని ఉపయోగించలేని సందర్భాల్లో టారిఫ్‌లను తమ బలప్రయోగం కోసం ట్రంప్ వినియోగించుకుంటున్నారు'' అని రాజన్ పేర్కొన్నారు.

# అమెరికా సుంకాల దెబ్బ...

**భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**
**705 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**
**211 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**
**డాలరుతో రూపాయి మారకం విలువ 87.63**




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు అమల్లోకి రావడంతో మదుపరుల సెంటిమెంట్ తీవ్రంగా దెబ్బతింది. దీనికితోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు కొనసాగుతుండటం సూచీల పతనానికి దారితీసింది. ఈ అమ్మకాల సునామీలో మదుపరుల సంపద భారీగా హరించుకుపోయింది. ఒక్కరోజే బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ ఏకంగా రూ.4 లక్షల కోట్లు తగ్గి రూ.445 లక్షల కోట్లకు పడిపోయింది.

ఈ ఉదయం 80,754 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్, రోజంతా అదే బాటలో పయనించింది. ట్రేడింగ్ మధ్యలో ఒక దశలో 80,013 పాయింట్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరికి 705 పాయింట్ల భారీ నష్టంతో 80,080 వద్ద స్థిరపడింది. మరోవైపు, నిఫ్టీ సైతం 211 పాయింట్లు కోల్పోయి 24,500 వద్ద ముగిసింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఐటీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది.

సెన్సెక్స్ 30 షేర్లలో ఐటీ దిగ్గజాలైన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్‌తో పాటు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా నష్టపోయాయి. అయితే టైటాన్, ఎల్అండ్‌టీ, మారుతీ సుజుకీ, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్ వంటి షేర్లు మాత్రం లాభాలతో గట్టెక్కాయి.

డాలరుతో రూపాయి మారకం విలువ 87.63 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర 67.79 డాలర్ల వద్ద, ఔన్సు బంగారం ధర 3,397 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## మోదీ సర్కార్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించిన ఆన్‌లైన్ గేమింగ్ సంస్థ!




**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థ కోర్టు మెట్లెక్కింది. దేశంలోని ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ అయిన గురువారం కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్-మనీ ఆధారిత గేమ్‌లపై నిషేధాన్ని సవాలు చేస్తూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ చట్టంపై సంతకం చేసిన తర్వాత ఈ చట్టానికి వ్యతిరేకంగా కోర్టులో దాఖలు చేసిన మొదటి పిటిషన్ ఇది.

పార్లమెంటు ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్లు, 2025 ను ఆమోదించినప్పుడు రియల్-మనీ ఆన్‌లైన్ గేమింగ్ వ్యాపారం ఎదురుదెబ్బ తగిలింది. ఈ బిల్లు కింద, అన్ని రకాల డబ్బు ఆధారిత ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధించారు. మరోవైపు, ఇ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమ్‌లను ప్రోత్సహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం పొందిన తర్వాత, ఈ బిల్లు ఇప్పుడు చట్టంగా మారింది. ఇటువంటి యాప్‌ల ద్వారా పెరుగుతున్న మాదకద్రవ్య వ్యసనం, మనీలాండరింగ్, ఆర్థిక మోసాల కేసులను అరికట్టడం దీని ముఖ్య ఉద్దేశ్యం. పార్లమెంటు బిల్లును ఆమోదించిన తర్వాత, ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు తమ రియల్ మనీ గేమింగ్ ఆఫర్‌లను నిలిపివేసాయి.

రాయిటర్స్ కథనం ప్రకారం, రమ్మీ, పోకర్ వంటి ఆటలను ఆన్‌లైన్‌లో అందించే గేమింగ్ ప్లాట్‌ఫామ్. కర్ణాటక హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో, "ఈ చట్టం నైపుణ్యాల ఆధారంగా ఆన్‌లైన్ ఆటలను ఆడే చట్టబద్ధమైన వ్యాపారాన్ని నేర వర్గంలోకి తీసుకువస్తుంది. దీని కారణంగా, అనేక ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు రాత్రిపూట మూసివేయాల్సి రావచ్చు" అని పేర్కొంది. తన పిటిషన్‌లో రాష్ట్రం యజమానిగా మారే మనస్తత్వం ఫలితంగా కొత్త చట్టం వచ్చిందని పేర్కొంది. ఈ చట్టం రమ్మీ, పోకర్ వంటి నైపుణ్య ఆటలకు వర్తింపజేశారు, దీనిని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కోరింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. కేసును ఆగస్టు 30కి వాయిదా వేసింది. అయితే, ఈ విషయంపై ఐటీ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించలేదు. ఇదిలావుంటే,దేశంలో ఆన్‌లైన్ గేమ్స్ వల్ల యువత తీవ్రంగా నష్టపోతోంది. ఎంతోమంది యువకులు ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్‌లో డబ్బులు నష్టపోయి.. అప్పుల్లో కూరుకుపోయి చివరకు ప్రాణాలు తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటివి ఎన్నో ఘటనలు కూడా చూశాం. అంతేకాదు పోలీసులు ఈ గేమింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలను సైతం విచారణ జరిపారు. అంటే ఈ గేమింగ్ యాప్‌ల ప్రభావం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అందుకే కేంద్ర ప్రభుత్వం కొత్త గేమింగ్ యాక్ట్‌ను తీసుకొస్తోంది. రియల్-మనీ గేమ్‌లను నిషేధించడం.. ఆన్‌లైన్ గేమింగ్‌ను నియంత్రించడానికి దోహదపడనుంది ఈ చట్టం. అదే సమయంలో స్పోర్ట్స్, సోషల్ ఆన్‌లైన్ గేమింగ్‌లోనూ ఆర్థిక వాటా లేకుండా చూసుకుంటుంది. డబ్బులతో కూడిన క్రికెట్ బెట్టింగ్ లాంటి స్కిల్ గేమ్స్‌తోపాటు.. పోకర్, రమ్మీ లాంటి చాన్స్ తీసుకునే ఆన్‌లైన్ ఆటలను ఎవరైనా ప్రమోట్ చేసినా ఆఫర్ చేసినా.. అందులో పెట్టుబడులు పెట్టినా ఇకపై జైలుకు వెళ్లక తప్పదు. అలాంటి ఆన్‌లైన్ ఆటల్లో అసలు ఆర్థిక లావాదేవీలు జరగకుండా బ్యాంకులు, పేమెంట్ ప్లాట్‌ఫామ్స్ నుంచి ప్రాసెసింగ్‌ను నిషేధిస్తారు. దీనివల్ల అసలు పేమెంట్స్ కూడా చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఒకవేళ ఈ నిబంధనలను పాటించకుండా ఎవరైనా అతిక్రమిస్తే 3 నుంచి 5ఏళ్ల జైలు శిక్ష, కోటి రూపాయల వరకు జరిమానాలు ఉంటాయి.

## వరద బాధితులకు జియో, ఎయిర్‌టెల్ సాయం..!




**న్యూఢిల్లీ:** భారీ వర్షాలు, వరదలు అనేక కుటుంబాలను ప్రభావితం చేశాయి. వరద ప్రాంతంలో చిక్కుకున్న వారు కనెక్టివిటీ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో ప్రముఖ టెలికామ్ సంస్థలైన జియో, ఎయిర్‌టెల్ ఈ ప్రాంతంలో చిక్కుకున్న వారికి సహాయం చేయడానికి ముందుకు వచ్చాయి. దేశంలోని వర్షం, వరద ప్రభావిత ప్రాంతాలలోని అన్ని ప్రీపెయిడ్ వినియోగదారులకు జియో 3 రోజుల చెల్లుబాటు పొడిగింపును ప్రకటించింది. దీనితో పాటు వినియోగదారులు రోజుకు హై-స్పీడ్ డేటా, మూడు రోజుల పాటు అపరిమిత వాయిస్ కాల్‌లను పొందుతారు. జియోహోమ్ వినియోగదారులకు, అంతరాయం లేని సేవలను నిర్ధారించడానికి వారికి అదనంగా 3 రోజుల పొడిగింపు అందించబడుతుంది.

ఇంతలో జియో పోస్ట్‌పెయిడ్ ఉపయోగిస్తున్న వారికి బిల్లు చెల్లింపులకు 3 రోజుల గ్రేస్ పీరియడ్ లభిస్తుంది, దీని వలన వారు ఎటువంటి సేవా అంతరాయం లేకుండా కాల్ చేయడం, డేటాను ఉపయోగించడం కొనసాగించవచ్చు. ఎయిర్‌టెల్ రోజుకు ఉచిత కాలింగ్, డేటాను అందిస్తుంది.



# రెండో సీడ్‌పై సంచలన విజయం..

**క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లిన సింధు**

పారిస్: పారిస్ వేదికగా జరుగుతున్న బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అదరగొడుతోంది. తొలి రెండు రౌండ్లలో పోరాడి గెలుపొందిన తెలుగు తేజం ఈసారి రెండోసీడ్‌ను అలవోకగా చిత్తు చేసింది. గురువారం జరిగిన 16వ రౌండ్‌లో చైనాకు చెందిన వాంగ్ జీ యూని మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టిందీ ఒలింపిక్ విజేత.
మాజీ ఛాంపియన్ అయిన సింధు బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో జోరు చూపిస్తోంది. తొలి రౌండ్‌లో బల్గేరియాకు చెందిన కలోయనా నల్బంతోవాను ఓడించిన సింధు పదహారో రౌండ్‌లో మలేషియా షట్లర్ కరుపథెవన్‌ను ఇంటికి పంపింది. కీలకమైన ప్రీ క్వార్టర్స్‌లోనూ చెలరేగిన భారత స్టార్ రెండో సీడ్ వాంగ్ జీకి షాకిచ్చింది.
హోరాహోరీగా సాగిన తొలి సెట్‌ను 21-19తో కైవసం చేసుకున్న సింధు.. రెండో సెట్‌లోనూ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు. వాంగ్ పుంజుకుని స్కోర్లు సమం చేసినా తనదైన పవర్ గేమ్‌తో సింధు 21-15తో సెట్ గెలుచుకుంది. ఈ విజయంతో టైటిల్ వేటకు రెండడుగుల దూరంలో నిలిచిందీ బ్యాడ్మింటన్ స్టార్.

# సెప్టెంబర్ 4న దుబాయ్‌కు టీమిండియా..

**బ్యాచ్‌లుగా వెళ్లనున్న ఆటగాళ్లు..!**

**న్యూఢిల్లీ:** పదిహేడో సీజన్ ఆసియా కప్ టోర్నమెంట్‌కు సమయం దగ్గరపడుతోంది. టైటిల్ ఫేవరెట్ అయిన భారత జట్టు పటిష్టమైన స్క్వాడ్‌తో ఈ మెగా క్రీడా సమరంలో పోటీపడనుంది. ఈ టోర్నీ కోసం టీమిండియా బృందం వచ్చే వారం దుబాయ్‌కు బయల్దేరనుంది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని మన సైన్యం సెప్టెంబర్ 4న అక్కడికి చేరుకోనుంది. అయితే.. బృందంలోని 15 మంది ఒక్కసారిగా కాకుండా బ్యాచ్‌లుగా వెళ్తారని సమాచారం. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ మొదలవ్వనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత జట్టు అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు నాలుగైదు రోజుల ముందే అక్కడికి చేరుకోనుంది. దుబాయ్‌లో సెప్టెంబర్ 4న క్రికెటర్లు అంతా ఒక్కచోట చేరుతారు. 'సెప్టెంబర్ 4 సాయంత్రం కల్లా స్క్వాడ్‌లోని ఆటగాళ్లందరూ దుబాయ్ చేరుకుంటారు. అక్కడి ఐసీసీ అకాడమీలో మరుసటి రోజే నెట్ సెషన్‌లో పాల్గొంటుంది టీమిండియా. లగేజీ, కిట్‌తో ప్రయాణించాల్సి వస్తుంది కాబట్టి ఆటగాళ్ల సౌకర్యార్థం వాళ్లు తమతమ పట్టణాల నుంచే నేరుగా దుబాయ్‌కు వచ్చేస్తారు' అని బీసీసీఐలోని సీనియర్ అధికారి పీటీఐ వార్తా సంస్థతో వెల్లడించాడు.




ఆసియా కప్ స్క్వాడ్‌లోని కొందరు దులీప్ ట్రోఫీలో ఆడుతున్నారు. యువ పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా నార్త్ జోన్‌కు, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ సెంట్రల్ జోన్ తరఫున బరిలోకి దిగారు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ముగియగానే వీళ్లు కూడా సెప్టెంబర్ 4న దుబాయ్ చేరుకుంటారు. ఆసియా కప్ లీగ్ దశలో సెప్టెంబర్ 10న ఆతిథ్య యూఏఈతో భారత జట్టు తలపడనుంది. అనంతరం 14న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఢీకొననుంది సూర్యకుమార్ సేన. సూపర్ ఫోర్‌కు ముందు జరుగబోయే చివరి లీగ్ మ్యాచ్‌లో పసికూన ఒమన్‌తో టీమిండియా ఆడనుంది.

**ఆసియా కప్ స్క్వాడ్ :** సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), రింకూ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి.

**ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో**

# చరిత్ర సృష్టించిన చికిత..

**అభినందించిన డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్ :** ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో ఇండియా తరఫున చరిత్ర సృష్టించిన తెలంగాణ ముద్దుబిడ్డ చికితను అభినందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందించారు. రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత తానిపర్తి ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో అండర్-21 మహిళల విభాగంలో స్వర్ణ పతకం సాధించడంపై డిప్యూటీ సీఎం భట్టి హర్షం వ్యక్తం చేశారు. విశ్వవేదికలపైనే దేశ పతాకాన్ని రెపరెపలాడిస్తున్న చికిత మరిన్ని ఘన విజయాలు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. శనివారం కెనడాలోని విన్నిపెగ్‌లో జరిగిన టోర్నమెంట్‌లో ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా నిలిచిన చికిత దేశానికి, రాష్ట్రానికి గర్వకారణమన్నారు. 20 ఏళ్ల ఈ యువ ఆర్చర్ టోర్నమెంట్ అంతటా అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించిందని ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికలపైన భవిష్యత్తులో సైతం చికిత ఇలాంటి అద్భుత విజయాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కాగా, ఆగస్టు 28 సాయంత్రం 4 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్న చికిత తానిపర్తికి స్వాగతం పలికేందుకు క్రీడాభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు.




# వంద టెస్టులు ఆడినా పట్టించుకోరా..

**దిగ్గజ ఆటగాళ్లకు ఘనంగా వీడ్కోలు పలకలేరా..?**

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన క్రికెటర్లు ఒక్కరొక్కరుగా వీడ్కోలు పలుతుకున్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రెండు ఫార్మాట్ల నుంచి తప్పుకోగా.. ఛతేశ్వర్ పుజారా మొత్తంగా మూడింటికీ రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ నేపథ్యంలో.. అత్యంత సీనియర్ ఆటగాళ్లు అయిన వీళ్లకు ఘనమైన వీడ్కోలు లభించకపోవడంపై మాజీలు మండిపడుతున్నారు. దేశం తరఫున వందకు పైగా టెస్టులు ఆడిన కోహ్లీ, పుజారాలకు అద్భుతంగా సెండ్ ఆఫ్ ఇవ్వాల్సింది అని అభిప్రాయపడ్డాడు మాజీ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ . వెటరన్ క్రికెటర్ల విషయంలో ఏమీ పట్టనట్టుగా ఉంటున్న బీసీసీఐ తీరుని ఆయన తీవ్రంగా విమర్శించాడు.

ఇంగ్లండ్ పర్యటనకు ముందే రోహిత్ టెస్టులకు టాటా చెప్పేయగా.. ఐదు రోజులకే కోహ్లీ కూడా సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు. సుదీర్ఘ కాలం ఆడి.. కెప్టెన్‌గా జట్టుకు చిరస్మరణీయ విజయాలు అందించిన ఇరువురికి ఘనంగా, గౌరవపూర్వకంగా వీడ్కోలు పలకాల్సిందని పలువురు బీసీసీఐకి సూచించారు. తాజాగా నయావాల్ పుజారా కూడా రెండేళ్లుగా టెస్టు ఛాన్స్ కోసం నిరీక్షించి అల్విదా చెప్పాడు. దాంతో.. ఈ ముగ్గురికి గొప్పగా వీడ్కోలు పలకాల్సిన బీసీసీఐ మిన్నకుండిపోవడం సరికాదని యూట్యూబ్ ఛానెల్ వేదికగా శ్రీకాంత్ మండిపడ్డాడు.

'దేశం తరఫున 100 టెస్టులు ఆడడం అంటే మామూలు విషయం కాదు. నూరు మ్యాచులు ఆడినవాళ్లంతా గొప్ప ఆటగాళ్లే. అలాంటి వాళ్లకు గౌరవపూర్వకంగా ఘనమైన వీడ్కోలు పలకాలి. అయితే.. రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ సమయంలో బీసీసీఐకి ముందస్తు సమాచారం లేదనే మాటతో ఏకీభవిస్తాను. కానీ.. అధికారులు వాళ్లతో మాట్లాడాల్సింది. కానీ అలా చేయలేదు. కోహ్లీ మరో రెండేళ్లు టెస్టులు ఆడాల్సింది.

'ఇంగ్లండ్ పర్యటనలో సిరీస్ డ్రా చేసుకున్నాం' కాబట్టి కోహ్లీ లేకున్నా పర్లేదని కొందరు అంటున్నారు. ఇప్పుడు పుజారా సైతం పునరాగమనం ఆశలు సన్నగిల్లడంతో నిరాశతో వీడ్కోలు ప్రకటన చేశాడు. ఇంగ్లండ్ పర్యటనలో తనకు చోటు లభిస్తుందని ఆశించిన అతడికి సెలెక్టర్లు షాకిచ్చారు. రిటైర్మెంట్ ఆలోచనతో ఉన్న అతడితో మాట్లాడి ఒక టెస్టు అయినా ఆడించి ఉంటే బాగుండు. కానీ, సెలెక్టర్లు, బీసీసీఐ పెద్దలు పుజారాను అడిగిన పాపాన పోలేదు' అని శ్రీకాంత్ నిప్పులు చెరిగాడు.




### చరిత్రాత్మక విజయాల్లో..

సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్‌కు ఆడిన గొప్ప ఆటగాళ్లలో కోహ్లీ, పుజారా, రోహిత్ కచ్చితంగా ఉంటారు. టాపార్డర్‌లో విలువైన భాగస్వామ్యాలతో జట్టును ఆదుకున్న ఈ ముగ్గురు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ పర్యటనల్లో చరిత్రాత్మక విజయాల్లో భాగమయ్యారు. టెస్టుల్లో టీమిండియాను నంబర్ 1గా నిలిపిన కోహ్లీ 123 మ్యాచ్‌లు ఆడగా.. హిట్‌మ్యాన్ 67, నయావాల్ 103 మ్యాచ్‌ల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించారు.

### ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ ఇచ్చిన నివేదా పేతురాజ్..

# వ్యాపారవేత్తతో ఏడడుగులు

**కాబోయే భర్తను సోషల్ మీడియాలో పరిచయం చేసిన నివేదా**

**వ్యాపారవేత్త రాజ్‌హిత్ ఇబ్రాన్‌తో త్వరలో వివాహం**

**సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న శుభాకాంక్షలు**



**టాకీస్:** ప్రముఖ టాలీవుడ్ నటి నివేదా పేతురాజ్ తన అభిమానులకు ఓ తీపి కబురు అందించారు. త్వరలోనే తాను వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తనకు కాబోయే భర్తను పరిచయం చేస్తూ, ఇప్పటికే తమ నిశ్చితార్థం కూడా జరిగిపోయిందని వెల్లడించారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫొటో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

నివేదా పేతురాజ్ వివాహం చేసుకోబోయే వ్యక్తి పేరు రాజ్‌హిత్ ఇబ్రాన్. ఆయన ఒక వ్యాపారవేత్త అని సమాచారం. రాజ్‌హిత్ దుబాయ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అనే ప్రచారం జరుగుతోంది. వీరి వివాహ వేడుక ఈ ఏడాది చివరి నాటికి జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ వేడుకను ఎలాంటి ఆడంబరాలు లేకుండా కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో నిరాడంబరంగా నిర్వహించాలని ఇరు కుటుంబాలు నిర్ణయించుకున్నట్లు సమాచారం. పెళ్లికి సంబంధించిన మరిన్ని అధికారిక వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.

నివేదా పెళ్లి వార్త తెలియగానే ఆమె అభిమానులు, శ్రేయోభిలాషులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా కొత్త జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. చాలామంది ఆమె కాబోయే భర్త వివరాల కోసం ఆసక్తిగా వెతుకుతున్నారు.

తమిళ చిత్రం 'ఒరు నాల్ కూతు'తో నటిగా అరంగేట్రం చేసిన నివేదా, 'మెంటల్ మదిలో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'అల వైకుంఠపురములో', 'చిత్రలహరి', 'బ్రోచేవారెవరురా', 'దాస్ కా ధమ్కీ' వంటి విజయవంతమైన చిత్రాలలో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

# నా కూతురు సినిమాల్లోకి రాదు: కాజోల్ దేవగణ్



టాకీస్:

బాలీవుడ్‌లోకి తన కూతురు నైసా దేవ్‌గణ్ ఎంట్రీ ఎప్పుడు ఉంటుందనే వార్తలపై క్లారిటీనిచ్చింది నటి కాజోల్ దేవ్‌గణ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. చాలామంది స్టార్ కిడ్స్ మాదిరిగా నైసాకు నటిగా మారే ఉద్దేశం లేదని కాజోల్ స్పష్టం చేసింది. "నా కూతురు సినీ రంగంలోకి రావడం లేదు. ఆమెకు ఇప్పుడు 22 ఏళ్లు, తన భవిష్యత్తుపై ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. ఆమె సినీ పరిశ్రమలో కాకుండా వేరే రంగంలోకి వెళ్లాలని అనుకుంటోంది" అని కాజోల్ వెల్లడించారు. అయితే ఈ వ్యాఖ్యలతో నైసా బాలీవుడ్‌లో అడుగుపెట్టబోతుందన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. అలాగే నెపో-బేబీ వివాదంపై కాజోల్ మాట్లాడుతూ.. మీరు సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రోజే తెలుసుకోవాల్సిన విషయం.. ఇక్కడ మంచి, చెడు రెండు ఉంటాయని. మీరు విమర్శలకు గురవుతారని మీరు అర్థం చేసుకోవాలి. కొన్ని విమర్శలు కఠినంగా, కొన్ని అసంబద్ధంగా, భయంకరంగా ఉంటాయి. అయితే ఇవి తట్టుకుని నిలబడితేనే మీరు ఇండస్ట్రీలో రాణిస్తారు. ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ ఇలాంటివి ఎదుర్కోవాలి. వారికి తప్పించుకునే ఛాయిస్ ఉండందంటూ కాజోల్ చెప్పుకొచ్చింది. అయితే నైసా వేరే కెరీర్‌ను ఎంచుకున్నప్పటికీ ఈ ఏడాది పలువురు స్టార్ కిడ్స్ బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ, కాజోల్ మేనల్లుడు ఆమన్ దేవగన్, సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్ 2025లో అరంగేట్రం చేశారు. ఇక, శనయ కపూర్ విక్రాంత్ మాస్సే సరసన తన ఎంట్రీని ఇవ్వగా, అహాన్ పాండే తన బ్లాక్‌బస్టర్ డెబ్యూ 'సైయారా'తో అందరి దృష్టిని ఆకర్షించారు.

# కొత్త లోక ట్రైలర్ విడుదల

టాకీస్: ప్రేక్షకులను అలరించేందుకు మరో ఫాంటసీ థ్రిల్లర్ రాబోతోంది. కల్యాణి ప్రియదర్శన్ , నస్లేన్ ప్రధాన పాత్రల్లో డామినిక్ అరుణ్ తెరకెక్కించిన చిత్రం 'కొత్త లోక' తొలిభాగం 'కొత్త లోక: చంద్ర' పేరుతో



ఈ నెల 29న బాక్సాఫీసు ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇప్పటికే మలయాళం ట్రైలర్ రిలీజ్ చేసిన చిత్ర బృందం తెలుగు ట్రైలర్ ను మంగళవారం విడుదల చేసింది. ఇందులో సూపర్ పవర్స్ ఉన్న లోకగా కల్యాణి కనిపించారు. వేరే ఊరికి వెళ్లిన లోక.. ఎందుకు తన పద్ధతి మార్చుకోవాల్సి వచ్చింది? ఆమెకు ఎదురైన సవాళ్లేంటి? తదితర అంశాలతో సినిమాని తెరకెక్కించనట్టు- -ట్రైలర్ చూస్తూ అర్థమవుతోంది.



# వారెవ్వా వాటే బ్యూటీ..

**అదిరిపోయే లుక్‌లో తళుక్కుమన్న ప్రభాస్ హీరోయిన్..**

టాకీస్: ఇప్పుడిప్పుడే తెలుగులోకి ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతుంది మలయాళీ కుట్టి మాళవిక మోహనన్. ఇప్పటివరకు తమిళం, మలయాళం చిత్రాల్లో నటించి మంచి ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. తాజాగా సోషల్ మీడియాలో చీరకట్టులో ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. చీరకట్టులో అమ్మాడి అందాల ఫోజులకు ఫిదా అవుతున్నారు నెటిజన్స్. హీరోయిన్ మాళవిక మోహనన్.. తెలుగులో ఒక్క సినిమా రిలీజ్ కాకుండానే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ తెలుగులో రాజాసాబ్ మూవీలో నటిస్తుంది. ప్రభాస్ , డైరెక్టర్ మారుతీ కాంబోలో వస్తున్న ఈ సినిమా త్వరలోనే రిలీజ్ కానుంది. పట్టంపోలే సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఇందులో మలయాళీ స్టార్ దుల్కర్ సల్మాన్ సరసన నటించి మెప్పించింది. మొదటి చిత్రంతోనే అందం, అభినయంతో కట్టిపడేసిన ఈ బ్యూటీకి ఆఫర్స్ క్యూ కట్టాయి. ఆ తర్వాత తమిళం, మలయాళం భాషలలో వరుసగా సినిమాలు చేసి తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సంపాదించుకుంది. కానీ ఇప్పటివరకు తెలుగులో ఒక్క సినిమా కూడా చేయలేదు. కానీ డబ్బింగ్ సినిమాలతోనే ఫేమస్ అయ్యింది. ఇప్పుడు రాజాసాబ్ చిత్రంతో తెలుగులోకి ఎంట్రీ ఇస్తుంది. ఇదిలా ఉంటే.. అటు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది మాళవిక. తాజాగా వినాయక చవితి సందర్భంగా చీరకట్టులో ఎంతో అందంగా ముస్తాబైంది. ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట తెగ ఆకట్టుకుంటున్నాయి. సింపుల్ చీరకట్టులో మరింత అందంగా కనిపిస్తుంది ఈ వయ్యారి. ఈ ఫోటోస్ చూసిన నెటిజన్స్ మాళవిక అందాల ఫోజులకు ఫిదా అవుతున్నారు.

# ఓజీ నుంచి సువ్వి..సువ్వి పాట విడుదల




**టాకీస్:** పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న సినిమా 'ఓజీ'. పవన్ సరసన ప్రియాంకా మోహన్ నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. వినాయక చవితి సందర్భంగా తాజాగా ఈ సినిమా నుంచి 'సువ్వి.. సువ్వి' పాటను చిత్రబృందం విడుదల చేసింది. 'ఉండిపో ఇలాగా.. తోడుగా.. నా మూడు ముళ్లలాగా' అంటూ సాగే లిరిక్స్ కల్యాణ్ చక్రవర్తి రాయగా.. శ్రుతి రంజనీ ఆలపించారు.

# బాహుబలి ది ఎపిక్

**ప్రభాస్, తమన్నాల రొమాన్స్ కట్**



**టాకీస్:** రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కి.. తెలుగు సినిమా ఖ్యాతిని పెంచిన 'బాహుబలి' మరోసారి వండర్స్ సృష్టించడా నికి ఒకేచిత్రంగా విడుదలవుతోంది. ఈ చిత్రం విడుదలై పదేళ్లు పూర్తయిన సంద ర్భంగా మరోసారి ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు టీమ్ ప్రకటించింది. రెండు భాగాలుగా వచ్చిన సినిమాలను 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే భాగంలో తీసుకురా నున్నారు. అయితే అందులోని ఏ సన్నివేశా లను కట్ చేస్తారా? అని అందరిలో ఆసక్తి నెలకొంది. తాజాగా ఓ హాలీవుడ్ మీడియా కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దర్శకధీరుడు ఈ సినిమాకు సంబంధించిన కొన్ని విషయాల ను పంచుకున్నారు. బాహుబలి: ది ఎపిక్' రిలీజ్ విషయంలో అన్నిటికంటే కష్టమైన పని ఎడిటింగ్ అన్నరు. రెండూ కలిపి దాదాపు 5 గంటల 27 నిమిషాల రన్-టైమ్ ఉన్నాయి. వీటిని కట్ చేసి ఒక భాగంగా విడుదల చేయాలి. ఏ సన్నివేశాలను ఉంచాలి? వేటిని తీసేయాలి? అనే విషయంపై మేం తీవ్రంగా చర్చించుకుంటున్నట్లు వెల్డించారు. 'బాహుబలి'లోని ప్రతి సన్నివేశం, పాట నాకు విలువైనదే. దేన్ని తీసేయాలో అర్థం కాలేదు. నిడివి తగ్గించాలంటే కొన్ని కట్ చేయక తప్పదు. అందుకే పాట, కొన్ని సన్నివేశాలను తొలగించాలని నిర్ణయించాం. 'కన్నా నిదురించరా' పాటను కట్ చేశాం. అలాగే, ప్రభాస్-తమన్నా మధ్య సాగే కొన్ని రొమాంటిక్ సన్నివేశాలను కూడా తొలగించాలని నిర్ణయించుకున్నాం. 'బాహుబలి: ది ఎపిక్'తో ప్రేక్షకులకు కొత్త అనుభవాన్ని ఇవ్వాలనుకుంటున్నా అని రాజమౌళి తెలిపారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.